MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 2 రంగారెడ్డి అక్టోబర్ 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

## మహిళా సాధికారత ! రెండు సదస్సులు ! బాలికా సంరక్షణ!

జాతీయం!



తిరుపతిలో జరిగిన చట్టసభల మహిళా సాధికారత కమిటీల జాతీయ సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా, ఏ పి అసెంబ్లీ స్పీకర్ శ్రీ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ శ్రీ రఘురామ రాజు, పార్లమెంట్ మహిళా కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి పురందేశ్వరి ప్రభృతులు

రాష్ట్రీయం




విజయవాడలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జువెనైల్ జస్టిస్ కమిటీ ఆధ్వర్యంలో బాలికా సంరక్షణ పై నిర్వహించిన సదస్సులో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ ధీరజ్ సింగ్ ఠాకూర్, బొంబాయ్ హైకోర్టు జడ్జి శ్రీమతి రేవతి మొహితె దరే ప్రభృతులు

Silver Jubilee Year
July 2025 - June 2026
apmas
Empowering Communities

## బీహార్‌లో ఏపిమాస్ ఆధ్వర్యంలో ఎఫ్ పి ఓల మహా సమ్మేళనం!




సమ్మేళనంలో పాల్గొన్న ఏపిమాస్ సి ఇ ఓ , ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి ప్రభృతులు

స్పిరిట్ ఆఫ్ విప్రో రన్‌లో ఏపిమాస్ ప్రత్యేక ఆకర్షణలు!








నాట్య విన్యాసాలు
కుమారి షర్మి (ఎడమ)
కుమారి మైథిల్య (కుడి)

పరుగు భంగిమ
శ్రీ సి ఎస్ రెడ్డి

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....

# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...

వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు





## జీవనోపాధులపై....



పెరిగే వలసలు



రోగాలతో
పెరుగుతున్న ఖర్చులు



ఆహార
భద్రతకు ముప్పు



పోషకాహార
లోపాలు



తగ్గే ఉపాధి
అవకాశాలు



పంట నష్టాలతో
పెరిగే అప్పులు

NABARD

మహిళా సాధికారత

సంపుటి 24 సంచిక 2



సంపాదకీయం

## సాధికారత ... సంరక్షణ !

**బా**లికల, మహిళల అభ్యున్నతికి సంబంధించి సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రెండు సదస్సులు ఆసక్తిదాయకంగా వున్నాయి. ఒకటి తిరుపతిలో జరిగిన 'పార్లమెంట్ ఉభయ సభలు, రాష్ట్రాల చట్టసభల మహిళా సాధికారత కమిటీల ప్రథమ జాతీయ సమ్మేళనం' కాగా, మరొకటి విజయవాడలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 'జువెనైల్ జస్టిస్ కమిటీ' (జె జె సి) ఆధ్వర్యంలో సంబంధిత వివిధ రంగాల భాగస్వాములతో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సు. ఒకటి ... ఏ చీడపీడలు లేకుండా 'మొక్క' ఎదుగుదల గురించి జాగ్రత్త వహించడానికి సంబంధించినది కాగా, మరొకటి ... పెరిగిన 'చెట్టు' సుదృఢంగా , ఫల పుష్పాలతో , స్వయంశక్తితో మరింత విస్తరించడానికి ఎలా దోహదం చేయాలో ఆలోచించేది. రెండు సదస్సులు నిర్దేశించుకున్న లక్ష్యాలమేరకు చక్కగా సాగాయి. బాలికల రక్షణ విషయంలో ఎంతటి జాగ్రత్తలు వహించాలో, సన్నిహితులైన వారు కూడా బాలికల పట్ల ఎలా అఘాయిత్యాలకు, అకృత్యాలకు పాల్పడతారో, తల్లిదండ్రులు ఎంత అప్రమత్తంగా వుండాలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ శ్రీ ధీరజ్ సింగ్ ఠాకూర్ వివరించారు. అక్షరాస్యతలో యిప్పటికీ బాలికల శాతం తక్కువగా వుండడాన్ని ఆయన గణాంకాలతో సహా పేర్కొంటూ, ఈ పరిస్థితి మారాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు మగ, ఆడ అనే తేడా చూపకుండా పిల్లలను పెంచాలని, మగ పిల్లలకంటె ఆడపిల్లలే తమను కన్నవారి బాగోగులపట్ల ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఛీఫ్ జస్టిస్ గారి విశ్లేషణ నేటి సామాజిక వ్యవస్థలో బాలికల స్థితికి అద్దం పడుతుంది. పోక్సో , బాల్య వివాహాల నిషేధ చట్టం, తదితర శాసనపరమైన రక్షణల గురించి బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించవలసిన ఆవశ్యకతను కూడా ఈ సదస్సు ప్రస్తావించింది. మరోవైపు తిరుపతిలో జరిగిన చట్టసభల మహిళా సాధికారత కమిటీల జాతీయ సమ్మేళనం అన్ని రంగాల్లో మహిళా సాధికారత ఆవశ్యకతను, దేశం అభివృద్ధి పథంలో మరిన్ని ముందడుగులు వేయాలంటే సాధికార మహిళల సంపూర్ణ సహకారం ఎంత అవసరమో విశ్లేషించింది. మహిళా సాధికారత సుందర స్వప్నం కేవలం కలగానే మిగిలిపోకుండా, వాస్తవ రూపం దాల్చి, కట్టెదుట సాక్షాత్కరించడానికి ఏమేమి చర్యలు తీసుకోవాలో ఈ సదస్సు కొన్ని తీర్మానాలు చేసింది. సమాజంలో ఏ మార్పు రావాలన్నా ముఖ్యంగా ప్రభుత్వాల ప్రోత్సాహ సహకారాలు అవసరమనే వాస్తవాన్ని ఈ సదస్సు గుర్తించడం ఆహ్వానించదగిన పరిణామం. ప్రభుత్వాలలో సర్వేసర్వత్ర లైంగిక న్యాయ పరమైన దృక్పథం వుండాలని ఈ సదస్సు పేర్కొనడం, బడ్జెట్లను కూడా ఈ దృష్టికోణంతోనే రూపొందించాలన్న తీర్మానం కూడా మహిళా సాధికారత సిద్ధించడానికి ఒక ప్రధాన ఆవశ్యకాంశమే. మహిళల ఆరోగ్య సంరక్షణకు, విద్యాభ్యాసానికి మరిన్ని నిధులు కేటాయించాలని, వారిని పారిశ్రామికవేత్తలుగా, వ్యాపార దక్షత కలిగినవారిగా తీర్చిదిద్దే అవకాశాలు కల్పించాలని, ఈ డిజిటల్ యుగంలో వారికి మరింత డిజిటల్ నైపుణ్యాన్ని అందుబాటులోకి తేవాలన్న, మరింతగా సైబర్ భద్రత కల్పించాలన్న ఆలోచనలు కూడా ఆశించదగినవే. అయితే, ఈ తీర్మానాలు యింత కాలంలోగా కార్యరూపం దాల్చాలన్న నిర్దిష్ట కాలపరిమితి ఏదైనా వున్నట్టు కనిపించదు. కాల పరిమితి, దశలవారీగా కార్యాచరణ ప్రణాళిక, అవసరమైన వనరులు, సహాయ సహకారాల వివరాలు, ఏ స్థాయిలో ఎవరెవరు ఏ బాధ్యతలు నిర్వహించాలో యివేవీ లేకుండా, కేవలం తీర్మానాల వల్ల కార్యం సిద్ధించదనే విషయం పట్ల ఈ సదస్సు నిర్వాహకులకు పూర్తి అవగాహన వుంటుందనే మనం ఆశించవచ్చు. ఈ తీర్మానాల అమలుకు యిప్పటికే సమగ్ర ప్రణాళిక రూపొంది వుంటుందని, లేకున్నా త్వరలోనే ఆ లోటు పూర్తవుతుందని కూడా భావించవచ్చు. లేకుంటే, యివి కేవలం కాగితాలమీది ప్రాజెక్టులుగానో, డిజిటల్ ఊహా చిత్రాలుగానో మిగిలిపోయే ప్రమాదంవుంది. శతాబ్దాలు, సహస్రాబ్దాలుగా ఈ ఊహా చిత్రాలు ఊరిస్తూనే వున్నాయి. ఇకనైనా వాస్తవ దృశ్యాలు కనువిందు చేస్తాయేమో చూడాలి.

Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy

ఒకే పరిస్థితి మనోబలం క్షీణిస్తే సమస్యగా, స్థిరంగా వుంటే సవాలుగా, దృఢంగా వుంటే అవకాశంగా మారుతుంది

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి, సాంకేతిక సహకారం : క్రిస్టొఫర్ వసంత్**


## లోపలి పేజీలలో ....


- ➪ బీహార్‌లో ఎఫ్‌పిఓల సమ్మేళన మహోత్సవం 05
- ➪ మహిళల స్వావలంబనతోనే 'వికసిత భారత్'! 08
- ➪ మూడేళ్ళకే గుర్రంకొండ ఎఫ్ పి ఓ ప్రగతి! 12
- ➪ భూమిసంపద, ఆదివాసి ఎఫ్‌పిఓల మహాసభలు 14
- ➪ ఇంటి పైకప్పు వర్షపు నీటి సేకరణపై శిక్షణ 16
- ➪ స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రకు స్కోచ్ అవార్డు 18
- ➪ పిల్లల పెంపకంలో 'మృదు స్పర్శ' ! 20
- ➪ పిల్లల అత్యుత్సాహంపై ఓ కన్నేయండి ! 21
- ➪ పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య 22
- ➪ ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం 23
- ➪ దేశంలోనే తొలి ఏఐ గ్రామం తెలంగాణలో ! 24
- ➪ మూతబడిన ఒంగోలు మహిళా మార్ట్ ! 25
- ➪ పొలం పనులకు ఉపాధి హామీ కూలీలు 26
- ➪ గ్రామాల్లో నీటిగుంటల మాదిరి మ్యాజిక్ డ్రైన్స్ 27
- ➪ డ్వాక్రా మహిళలకు డ్రోన్లు,క్యాంటీన్లు,కాఫీస్టాల్స్ 28
- ➪ ఒక్కసారి నాటితే ఆరుపంటలు పండే వరి! 30
- ➪ మునగ సాగుచేస్తే ఎకరాకు రూ.లక్ష ఉచితం! 32
- ➪ ఆసక్తిని రేకెత్తిస్తూ, అంగన్వాడీలలో బోధన 33
- ➪ ఒక్కసారి సాగు... 40 ఏళ్ళపాటు ఆదాయం! 34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృ సంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


జీవితంలో వచ్చే ఆటుపోట్లను మనం అభినందించాలి, అవే మనకు మరింత శక్తిని, వివేకాన్ని, వినయాన్ని అందిస్తాయి

# బీహార్‌లో ఎఫ్‌పిఓల మహాసమ్మేళన మహోత్సవం!

– జి శ్రీనివాస్

**బీ**హార్ లో ఎఫ్ పి ఓ లకు అది ఒక చిరస్మరణీయమైన రోజు. ఇప్పటివరకు ఎవరి ఆలోచనలు, ఎవరి కార్య క్రమాలు, ఎవరి సాధక బాధకాలు కేవలం వారికి మాత్రమే పరిమితంగా పని చేస్తున్న 'వ్యవసాయ ఉత్పత్తిదారు సంస్థ'లు (ఎఫ్ పి ఓ లు) ఒకే వేదిక మీదకు వచ్చి, ఉమ్మడిగా చర్చించి, ఎదుర్కొంటున్న సమస్యలను, కష్ట నష్టాలను, పొందుతున్న సౌకర్యాలను, అందుతున్న ప్రయోజనాలను బేరీజు వేసుకుని, సంబంధిత వివిధ విషయాలపై అవగాహనను పెంపొందించుకుని, ఇకపై కలసికట్టుగా ముందడుగు వేయాలని సంకల్పించిన బీహార్ రాష్ట్ర ఎఫ్ పి ఓల మహా సమ్మేళన మహా సంరంభ దినోత్సవమది! అది 2025 సెప్టెంబర్ 12వ తేదీ.

**వేదిక:** బీహార్ రాష్ట్ర రాజధాని పట్నాలోని హోటల్ చాణక్య.
**నిర్వాహక సంస్థలు:** ఏపిమాస్, ప్రదాన్.
**సహకారం:** భారత్ అలయెన్స్ ఫర్ ఎఫ్ పి ఓ యాక్సిలరేషన్ (బఫా)
**ఆర్థిక సహకారం :** డి జి ఆర్ వి, కోర్టేవా క్రాప్ అగ్రి సైన్స్ లిమిటెడ్

ఈ మహా సమ్మేళనంలో నాబార్డ్, యన్.సి.డి.సి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, సమున్నతి, సిడ్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి ఆర్థిక సంస్థల ప్రతినిధులు, ఇఫ్‌కో, డి హాట్, ఫార్మాట్, అగ్రిక్స్ వంటి మార్కెట్ సంస్థలు, డిజిటల్ గ్రీన్, మైక్రో సేవ్ వంటి టెక్నికల్ ఏజెన్సీలు, ప్రభుత్వ అధికారులు, ఎఫ్ పి ఓల బోర్డు సభ్యులు, మహిళా రైతులు కలిపి 160 మందికి పైగా ప్రతినిధులుపాల్గొన్నారు.

ఇది ఏపిమాస్ రజితోత్సవ (25 సంవత్సరాల ప్రస్థాన) సంవత్సరం, ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 'సహకార సంస్థల సంవత్సరం' కూడా కావడం ఈ సమ్మేళనానికి ఒక ప్రత్యేకతను సంతరించింది.

**కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలు**

1. ఎఫ్ పి ఓల విజయ గాథలను, సవాళ్ళను, ఆవిష్కరణలను పంచుకోవడం.
2. వివిధ భాగస్వాములతో చర్చలు జరిపి ఎఫ్ పి ఓ లకు బలమైన పునాదిని, అభివృద్ధిదాయక సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం.
3. బీహార్ రాష్ట్రానికి ప్రత్యేక ఎఫ్ పి ఓ విధాన రూప కల్పనపై చర్చించడం.
4. ఎఫ్ పి ఓలకు బీహార్ రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ మద్దతు లభించే మార్గాలను అన్వేషించడం.

**ప్రారంభ సమావేశం :**

కార్యక్రమాన్ని ఏపిమాస్ ఇ ఓ, ఎండి శ్రీ సి.ఎస్. రెడ్డి ప్రారంభిస్తూ, బీహార్ రాష్ట్రానికి ప్రత్యేకమైన ఎఫ్ పి ఓ విధానం అవసరమని అన్నారు. చిన్న రైతులు సమూహాలుగా ఏర్పడటం శుభప్రదమైనదే అయినా, మూలధనం కొరత, సామర్థ్యం లోపం వల్ల చాలావరకు ఎఫ్ పి ఓలు ముందుకు సాగలేక పోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ముఖ్య అతిథి, ఐ ఎ ఎస్ అధికారిణి, బీహార్ రాష్ట్ర ప్రభుత్వ పశు, మత్స్యశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డా. ఎన్. విజయలక్ష్మి మాట్లాడుతూ "రైతులు కేవలం పంటలపై మాత్రమే ఆధారపడకుండా, వ్యవసాయ పారిశ్రామిక వేత్తలు (అగ్రిప్రెన్యూర్స్), పాడి పారిశ్రామిక వేత్తలు (డెయిరీ –ప్రెన్యూర్స్), మత్స్య పారిశ్రామికవేత్తలుగా (ఫిషరీస్–ప్రెన్యూర్స్) ఎదగాలని అన్నారు.

'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఎఫ్ పి ఓలు – ఐ ఎస్ ఓ సర్టిఫికేషన్, ఎగుమతి లైసెన్సులు పొంది, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశించాలని సూచించారు. ఆమె, సారణ్ జిల్లాలో ప్రారంభమైన ఎగుమతుల స్థాయి పాల శీతలీకరణ కేంద్రాన్ని (మిల్క్

ప్రాసెసింగ్ యూనిట్) ఉదాహరణగా ప్రస్తావించారు.

ఈ సమావేశంలో నాబార్డ్ బీహార్ జీఎం శ్రీ లక్ష్మణ్ కుమార్, బి ఆర్ ఎల్ పి ఎస్ జీవనోపాధుల విభాగం ఎస్పీఎం డా. రాకేష్ కుమార్, బి ఆర్ ఎల్ పి ఎస్ మార్కెటింగ్ విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ సంగీత్ తమ అనుభవాలను, బీహార్లో ఎఫ్‌పిఓల భవిష్యత్ చిత్రం, కావలసిన మార్గదర్శకత్వంపై విశ్లేషణాత్మకమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు. వారు ఎఫ్ పి ఓ డైరెక్టర్ల బాధ్యత, వార్షిక సర్వసభ్య సమావేశం, ఆడిట్, ఆర్ ఓ సి ఫైలింగ్, జి ఎస్ టి రిటర్నులు, డైరెక్టర్ల కె వై సి వంటి అన్ని చట్టబద్ధమైన వ్యవహారాలను సమయానికి పూర్తి చేయడం ఎంత ముఖ్యమో వివరించారు.

రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పశుపోషణ, చేపల పెంపకం వంటి అనుబంధ జీవనోపాధుల వైపు దృష్టి పెట్టాలని సూచించారు. బి ఆర్ ఎల్ పి ఎస్ ప్రోత్సహించిన 'కౌశికీ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ' 30,000 మంది మహిళా వాటాదారులతో ప్రతిరోజూ 80,000 లీటర్ల పాలను ప్రాసెస్ చేస్తూ, సంవత్సరానికి రూ.127 కోట్లు టర్నోవర్, రూ.1 కోటి నికర లాభాన్ని సాధించడం ఒక ఆదర్శ ఉదాహరణగా పేర్కొన్నారు.

మరో ఉదాహరణగా 'సీమాంచల్ జీవిక గోట్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' ను ప్రస్తావిస్తూ, ఈ ఎఫ్ పి సి 20,000 మంది మహిళా వాటాదారులతో మాంసం అవుట్‌లెట్‌ను ప్రారంభించి, ఈశాన్య రాష్ట్రాలకు, బెంగాల్‌కు మేక మాంసాన్ని సరఫరా చేస్తూ పటిష్టంగా నడుస్తున్నట్టు వారు తెలిపారు.

భవిష్యత్‌లో ఎఫ్‌పిఓ లు తమ సొంత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించి, నిఫ్టెం వంటి సంస్థల సహాయాన్ని వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. బీహార్‌లో జి ఐ ట్యాగ్ పొందిన ఉత్పత్తులను ప్రోత్సహించ డానికి జీవిక చురుకుగా పని చేస్తూ, ఇప్పటికే కిషన్‌గంజ్‌లో టీ ప్రాసెసింగ్ యూనిట్ నుప్రారంభించి, త్వరలో మార్కెట్‌లో ఉత్పత్తులను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నదని, ఇదే బాటలో ఒకే భౌగోళిక పరిధిలో ఉన్న ఎఫ్ పి ఓలు, సి ఎల్ ఎఫ్ లు పరస్పరం సహకరించు కుంటూ, పరస్పర బలాలను వినియోగించుకోవాలని సూచించారు.

అనంతరం రెండు చర్చా గోష్టులను నిర్వహించారు

**చర్చా గోష్ఠి 1: ఎఫ్‌పి ఓ లను ఫైనాన్స్‌కు సిద్ధం చేయడం**

ఈ చర్చలో 'కిసాన్ ఖుషియా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' డైరెక్టర్ శ్రీమతి కాంచన్ దేవి తమ ఎఫ్ పి సి ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లను పంచుకున్నారు. నాబార్డ్ సహకారంతో నడుస్తున్న ఈ ఎఫ్ పి సి కి 1,360 మంది వాటాదారులు ఉండి, రూ.10,61,000 షేర్ క్యాపిటల్‌తో రూ.3.20 కోట్లు వ్యాపారం నిర్వహించింది. 800 మంది మహిళా రైతులకు సేవలందిస్తున్నప్పటికీ, బ్యాంకుల నుండి రుణాలు పొందడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె పేర్కొన్నారు.

వ్యాపార విస్తరణకు, కొత్త రంగాలలో అడుగు పెట్టడానికి తక్షణ ఆర్థిక సహాయం అవసరమని చెప్పారు. చర్చలో బ్యాంకుల నుండి రుణ దరఖాస్తుల తిరస్కరణకు డైరెక్టర్ల సిబిల్ స్కోర్లు ఒక ప్రధాన కారణమని, ఎన్ బి ఎఫ్ సి లు, ఎం ఎఫ్ ఐ లు కొంత సడలింపు ఇచ్చినా, వడ్డీ రేట్లు ఎక్కువగా వసూలు చేస్తున్నాయని వెల్లడించారు. ప్రభుత్వ పథకాల సమన్వయం ద్వారా పి ఎస్ యు లను, వాణిజ్య బ్యాంకులను సంప్రదించడం ఎఫ్‌పిఓలకు లాభదాయకమని సూచించారు. వీటితో పాటు, సమున్నతి, నాబ్ కిసాన్ వంటి ఎన్ బి ఎఫ్ సి లు ఎక్కువగా ఎఫ్‌పిఓలకు రుణాలు ఇస్తున్నాయని, బ్యాంకులు – ఎఫ్‌పిఓ లు పరస్పరం అవగాహనతో సహకరించుకోవడం ద్వారా రుణం అందుబాటు సులభతరం అవుతుందని సూచించారు.

**చర్చా గోష్ఠి 2 : ఎఫ్‌పిఓలను మార్కెట్‌కు సిద్ధం చేయడం**

"మార్కెట్ రెడీ" అంశంపై జరిగిన రెండవ చర్చా గోష్ఠిలో 'రాణి కృషి భగవాని స్వావలంబి సమితి' డైరెక్టర్ శ్రీ కన్హయ్య చౌదరి తన ఎఫ్‌పిఓ అనుభవాన్ని పంచుకున్నారు. ఈ ఎఫ్‌పిఓ 750 మంది వాటాదారులతో, రూ.2 కోట్లు వ్యాపారం నిర్వహిస్తోంది. కూరగాయలు, పూల వ్యాపారం, మొక్కజొన్న, గోధుమల మార్కెటింగ్‌లో క్రియాశీలంగా ఉంది.

పి ఎం ఎఫ్ ఎం ఇ పథకం కింద ఎం సి డి సి నుంచి

జీవితమంటే గొప్ప పాండిత్యమో, ఆడంబరంగా బతకడమో కాదు; ఇతరులకు నీవు పంచే ఆనందం మాత్రమే

రూ. 21 లక్షల రుణం పొంది ఈ ఎఫ్‌పిఓ మసాలా ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించింది. స్థానికంగా డిస్ట్రిబ్యూటర్లు, డీలర్ల ద్వారా మసాలా మార్కెటింగ్ ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ఇతర రాష్ట్రాల్లో పెద్ద స్థాయిలో మార్కెట్ లింకేజీలు ఏర్పరచడంలో కష్టాలు ఎదురవుతున్నాయి. ఉత్పత్తి డిజైన్‌ను మెరుగుపరచడం కూడా ఒక సవాలుగా ఉంది.

చర్చలో, ఎఫ్‌పి ఓ లు విలువ గొలుసులో మరింత అవగాహనతో పని చేస్తే ఎక్కువ లాభాలు పొందవచ్చని, ఎగుమతి మార్కెట్లలో అడుగు పెట్టడం అవసరమని సూచించారు. ప్రధాన ఇన్‌పుట్ తయారీదారుల డీలర్‌షిప్ పొందడానికి మొదట సబ్సిడీ లేని ఉత్పత్తుల విక్రయం ద్వారా నమ్మకం సంపాదించుకోవాలని తెలిపారు.

అదేవిధంగా పంటల తర్వాత నిర్వహణ, ప్రాసెసింగ్, విలువ పెంపు ద్వారా రైతులు – ఎఫ్‌పి ఓ లు అధిక ఆదాయం పొందవచ్చని, ప్రాంతానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేయాలని, ఉత్పత్తి – మార్కెటింగ్‌లో టెక్నాలజీ వాడకం పెంపొందించా లని సూచించారు.

**ఎఫ్ పి ఓ ల వేగం పెంపు : సి ఎస్ రెడ్డి**

ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి.ఎస్.రెడ్డి ఎఫ్ పి ఓలు అభివృద్ధి పరుగులో "ఇంక్యుబేషన్" దశ నుండి "యాక్సిలరేషన్" దశకు మారాలని సూచించారు. ఈ మార్పు మూడు ప్రధాన రంగాలపై దృష్టి పెట్టాని ఆయన అన్నారు.

గవర్నెన్స్ రెడీ (సభ్య రైతుల యజమాన్యం – బాధ్యతా నిర్మాణం స్పష్టంగా ఉండాలి), టెక్నాలజీ రెడీ (పంట, రైతుల డేటాను డిజిటలైజ్ చేసి వ్యాపార కార్యకలాపాలను మెరుగుపరచాలి), మార్కెట్ రెడీ (కలెక్షన్ సెంటర్లు, మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పరచి ఉత్పత్తి డేటా – మార్కెట్ విశ్లేషణ ఆధారంగా వ్యాపార ప్రణాళికలు రూపొందించాలి).

అదనంగా, రైతులకు ఉత్తమ పద్ధతులపై శిక్షణ ఇవ్వడం, క్లస్టర్ స్థాయి ఫెడరేషన్లను ప్రోత్సహించడం, వాతావరణ ప్రతికూలతలకు అనుగుణంగా చర్యలు చేపట్టడం, లైంగిక సమానత్వాన్ని ఎఫ్‌పి ఓ లలో ప్రధానంగా పాటించడం ఎంతైనా అవసరమనిఆయన సూచించారు.




**బీహార్ రాష్ట్ర ఎఫ్ పి ఓ విధానం – ప్రభుత్వ పాత్ర**

బీహార్ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎఫ్ పి ఓ పాలసీ ఉండాలని శ్రీ రెడ్డి ప్రతిపాదించారు. ఇందులో ఫైనాన్సింగ్ (ఎన్ బి ఎఫ్ సి ల/ ఎం ఎఫ్ ఐల అధిక వడ్డీ రేట్ల సమస్యను బ్యాంకులతో కో–లెండింగ్ మోడల్ ద్వారా పరిష్కరించడం), పర్మిట్లు – లైసెన్సులు (సింగిల్ విండో సిస్టమ్, భద్రతా ఫీజుల తగ్గింపు, ఛలాన్ ఫీజు మినహాయింపు), గవర్నెన్స్, ఇకోసిస్టం (రాష్ట్ర స్థాయి సంప్రతింపుల సంఘం, నోడల్ ఏజెన్సీ, బీహార్ ఎఫ్ పి ఓ పోర్టల్ ఏర్పాటు) వంటి అంశాలను చేర్చాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ పి ఓ లను స్వయం ప్రతిపత్తి వ్యాపార సంస్థలుగా గుర్తించి ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లతో సమన్వయం కల్పించాలని, కలెక్షన్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, గోదాముల వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయడంలో భాగస్వామ్యం కావాలని, జిల్లా స్థాయిలో డి–ఎంసిలు ఏర్పాటు చేసి లైసెన్స్ జారీని వేగవంతం చేయాలని, సమస్యలను పరిష్కరించడం, అలాగే జిల్లా రిసోర్స్ పర్సన్స్ బృందాన్ని ఏర్పాటు చేసి, ఎఫ్ పి ఓ ల సామర్థ్యాన్ని పెంచడం పై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

పల్లాడియం, ఇఫ్ కో, డి హాట్ వంటి సంస్థల నిపుణులు విలువ ఆధిక్యం, ఎగుమతి మోడల్స్, వ్యూహాత్మక మార్కెట్ లింకేజీలపై సూచనలు అందించారు. ఈ సూచనల ప్రాతిపదికన సమ్మేళనంలో 'బీహార్ ఎఫ్‌పి ఓ పాలసీ ముసాయిదా' పేరిట ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగింది. ఏపిమాస్, ప్రదాన్ సంస్థలు త్వరలో బీహార్ ప్రభుత్వానికి ఈ ఎఫ్ పి ఓ పాలసీ డ్రాఫ్టును సమర్పిస్తాయి. ■

ఆశాభావాన్ని మించిన కానుక లేదు, అనుభవ పాఠాలు నేర్పుతూ పరాజయం నుంచి విజయానికి చేర్చే నిచ్చెన అది

# మహిళల స్వావలంబనతోనే 'వికసిత భారత్'!

**ఆ దిశగా మహిళలసామర్థ్యం పెంపు : మహిళా సాధికారత కమిటీల జాతీయ మహాసభ తీర్మానం**

**పా**ర్లమెంట్ ఉభయ సభల (లోక్‌సభ, రాజ్యసభ), వివిధరాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల 'చట్టసభల మహిళా సాధికారత కమిటీల తొలి జాతీయ మహాసభ ' తిరుపతిలో 2025 సెప్టెంబర్ 14,15 తేదీలలో రెండు రోజులపాటు జరిగింది. లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ఈ సదస్సును ప్రారంభించారు. ఈ జాతీయ సదస్సుకు శ్రీ ఓం బిర్లాతో పాటు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ శ్రీ హరివంశ్ నారాయణ్ సింగ్, పార్లమెంటు మహిళా కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీం , ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ శ్రీ అయ్యన్నపాత్రుడు,




శాసనమండలి ఛైర్మన్ శ్రీ కొయ్యే మోషేను రాజు, డిప్యూటీ స్పీకర్ శ్రీ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు , 20కి పైగా రాష్ట్రాల నుంచి చట్టసభల ప్రతినిధులు, విధాన రూపకర్తలు పాల్గొన్నారు. తొలిరోజు సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు హాజరు కావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణంతో ఆయన పర్యటన రద్దయింది.

మహిళలు విద్యావంతులై, స్వావలంబన సాధించి నప్పుడే భారత్ సమ్మిళిత, అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. మహిళా నేతృత్వంలో సాగే అభివృద్ధే 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవడానికి బలమైన పునాది అని ఆయన అన్నారు. తిరుపతిలో తొలిసారిగా నిర్వహించిన పార్లమెంటు, రాష్ట్రాల చట్టసభల మహిళా సాధికారత కమిటీల రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన 14-09-2025 న ప్రారంభించారు. 'వికసిత్ భారత్ కోసం మహిళా నేతృత్వంలో అభివృద్ధి' అనే ప్రధాన అంశంతో ఈ రెండు రోజుల సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా మాట్లాడుతూ, దేశ ప్రగతిలో మహిళా సాధికారత, శిశు సంక్షేమం అనేవి సాధారణ అంశాలు కాదని, అవే దేశానికి పునాదులని పేర్కొన్నారు. పంచాయతీల నుంచి పార్లమెంటు వరకు ప్రతి స్థాయిలో మహిళల భాగస్వామ్యం పెరగాలని ఆయన ఆకాంక్షించారు. చట్టాలు, విధానాల రూపకల్పనలో మహిళల పాత్ర పెరిగినప్పుడే వారు చారిత్రకంగా ఎదుర్కొం టున్న సవాళ్లను అధిగమించగలరని తెలిపారు.

**ధనలక్ష్ములతోనే దేశం బాగు!**

మహిళలు ధనలక్ష్ములు అయితేనే దేశం బాగుంటుందని, 'వికసిత భారత్' సాకారంలో మహిళల ఆర్థిక సాధికారతే కీలకమని శ్రీ ఓం బిర్లా అన్నారు. ఆ దిశగా 'తిరుపతి తీర్మానాన్ని' ఆమోదించామని తెలిపారు. తిరుపతిలో చట్టసభల మహిళా సాధికారత కమిటీల జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన మాట్లాడారు. మహిళల సాధికారత అనేది కేవలం సామాజిక అవసరం మాత్రమే కాదని ఆర్థిక అవసరం కూడానని నొక్కి చెప్పారు.

మహిళల ఆరోగ్యం, విద్య, నైపుణ్యాల వంటి పెట్టుబడుల అపారమైన మానవ వనరులను అందిపుచ్చుకునే అవకాశముందన్నారు. తద్వారా దేశం బలమైన సామాజిక, ఆర్థిక అభివృద్ధి నమూనాను నిర్మించగలదని తెలిపారు. వికసిత భారత్ దిశగా చేస్తున్న ప్రయాణంలో మహిళల నాయకత్వం, వారి సహకారం కీలకమని చెప్పారు. కేంద్ర, రాష్ట్రాల అనుభవాలను, సమస్యలను, పరిష్కారాలను పంచుకునే

వేదికలుగా మహిళా సాధికార కమిటీల సదస్సులు పని చేస్తాయన్నారు.

**పరిజ్ఞానం అవసరం: హరివంశ్**

ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళలకు సాంకేతిక పరిజ్ఞానం కల్పించడం అవసరమని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. రాజ్యసభ, లోక్‌సభలలో మహిళా సభ్యులకు ప్రాధాన్యమిచ్చే సంప్రదాయం ప్రారంభించడం మంచి ప్రయత్నమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, దివంగత నటుడు ఎన్టీఆర్ మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని హరివంశ్ సింగ్ పేర్కొన్నారు. జన్‌ధన్ యోజనలో సగానికిపైగా ఖాతాలు మహిళలవేనని చెప్పారు.

**నాంది పలికిన మధ్యప్రదేశ్: పురందేశ్వరి**

దేశంలో తొలిసారిగా మధ్యప్రదేశ్ అసెంబ్లీ మహిళా సాధికారతపై కమిటీ ఏర్పాటు చేసిందని తద్వారా మహిళా



మాట్లాడుతున్న పార్లమెంట్ కమిటీ (మహిళా సాధికారత) చైర్‌పర్సన్ పురందేశ్వరి

సాధికారతకు ఆ రాష్ట్రం నాంది పలికిందని పార్లమెంటు మహిళా కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. 1987లో మధ్యప్రదేశ్ అసెంబ్లీ కమిటీ ఏర్పాటు చేశాక తర్వాత ఇతర రాష్ట్రాలలో కూడా కమిటీలు ఏర్పాటయ్యాయన్నారు. జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్, కొత్తగా ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు మహిళలను సన్నద్ధం చేసే విషయంపై చర్చలు జరిగాయన్నారు.

**మహిళా సాధికారతే ప్రజాస్వామ్యానికి బలం: గవర్నర్**

మహిళా సాధికారత మహిళలకే పరిమితం కాదని, సమాజం మొత్తానికి స్వేచ్ఛను, బలమైన ప్రజాస్వామిక సమాజాన్ని యిస్తుందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. శాసనసభల మహిళా సాధికారత కమిటీ జాతీయ సదస్సు రెండోరోజు కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రసంగించారు.

**బాల్య వివాహాలు**

సతి, బాల్య వివాహాలు వేదకాలంలో లేవని , మహిళలు గౌరవించబడిన చోట దైవత్వం వికసిస్తోందని చెప్పటం ద్వారా వేదకాలంలో మహిళలను ఎంతగా గౌరవించేవారో తెలుస్తుందని, ఒక కుటుంబంలో మహిళ ఆనందంగా ఉంటే, ఆ కుటుంబం మొత్తం ఆనందంగా ఉంటుందని ఆయన అన్నారు.

**మహిళలకు రాజకీయ అవకాశాలు**

'మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించటంలో 193 దేశాల్లో 148వ ర్యాంకులో భారతదేశం ఉందని, మిజోరం వంటి రాష్ట్రాల్లో ఒక్క సభ్యురాలు కూడా అసెంబ్లీలో లేరని, మహిళలకు రాజకీయ అవకాశాలు ఉంటేనే అభివృద్ధి సాధ్యమని గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

## సదస్సు ఆమోదించిన తీర్మానాలు

- జెండర్ సెన్సిటివ్ బడ్జెట్‌ను సంస్థాగతం చేయడం.
- అన్ని ప్రభుత్వ శాఖలు లైంగిక దృష్టి కోణం అనుసరించడం.
- మహిళల ఆరోగ్యం, విద్య, వ్యాపారం కోసం నిధుల పెంపు.
- మహిళల సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడం.
- మహిళల్లో డిజిటల్ అంతరాన్ని తగ్గించడం.
- స్టెమ్ రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం.
- మహిళలకు సైబర్ భద్రతను కల్పించడం.
- మహిళలకు డిజిటల్ అక్షరాసత్యను విస్తరించడం.
- మహిళలను సాంకేతిక సృష్టికర్తలుగా తీర్చిదిద్దడం.

**200 మందికి పైగా హాజరు**

తిరుపతి కేంద్రంగా సెప్టెంబర్ 14,15 తేదీలలో జరిగిన చట్టసభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది.

దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ప్రతినిధులు హాజరు కాగా, వారికి జిల్లా యంత్రాంగం ఉన్నతస్థాయి సదుపాయాలను కల్పించింది.

సదస్సు ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏపి అసెంబ్లీ, జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేసింది. కాగా, దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల నుంచీ మహిళా ప్రతినిధుల బృందాలు వచ్చాయి.

లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓంబిర్లా, ఏపీ అసెంబ్లీ స్పీకర్ శ్రీ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ శ్రీ రఘురామకృష్ణంరాజు, పార్లమెంటరీ మహిళా సాధికారత అధ్యక్షురాలు శ్రీమతి పురందేశ్వరి ఆయా బృందాల వద్దకెళ్లి యోగక్షేమాలతోపాటు బస, వసతి తదితరాలను గురించి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడించేలా సాధికారత సదస్సు నిర్వహించామని, అందుకు జిల్లా యంత్రాంగం పాత్ర చాలా కీలకమని స్పీకర్ ప్రశంసించారు.

ఉదయం తిరుమల శ్రీవారిని, మధ్యాహ్నం శ్రీకాళహస్తీశ్వరుడిని పలువురు డెలిగేట్లు దర్శించుకున్నారు. తొలిరోజు రాత్రి చంద్రగిరి కోటలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రెండవ రోజు రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున తిరుపతి కమిషనర్ మౌర్య పర్యవేక్షణలో డెలిగేట్లకు ఆత్మీయవిందు ఇచ్చారు.

మొదటి రోజు సదస్సులో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విడతల వారీగా సభ్యులు చర్చించారు. వాటిపరిష్కారానికి పలు సూచనలు చేశారు. రెండో రోజున మహిళా సాధికారత కమిటీలు చర్చించిన పలు తీర్మానాలు ఆమోదం పొందినట్లు లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ప్రకటించారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

## మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**మ**హిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. 'స్వస్త్ నారీ-సశక్త్ అభియాన్' (ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం) అనే నినాదంతో వైద్యశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా దీన్ని ప్రారంభించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యుపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా వైద్యశాలలు, జిల్లా వైద్యశాలల కేంద్రాల్లో వైద్యశిబిరాలను నిర్వహించేందుకు వైద్యశాఖ చర్యలు తీసుకుంది. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే కాకుండా పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి తగుజాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. మహిళలకు సమయానుకూల వైద్యసేవలు అందించడంతో పాటు వారు పౌష్టికాహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించడం ద్వారా ఆ కుటుంబాన్ని బలోపేతం చేయనున్నారు. 'ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి ఆధారం' అనే నినాదంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు.

ఈ ప్రత్యేక శిబిరాల్లో వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొంటారు. ప్రధానంగా ఈ వైద్యశిబిరాల్లో మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్‌లను పరీక్షల ద్వారా గుర్తిస్తారు. తగిన వైద్య చికిత్సలతో పాటు రెఫరల్ సేవలను అందిస్తారు. మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్సలను అందిస్తారు. గర్భిణులను పరీక్షించి పోషకాహారం ఆవశ్యకతను వివరిస్తారు. రక్తహీనత ఉన్న వారికి చికిత్సలు చేసి ఎంసీపీ కార్డులు అందజేస్తారు. పిల్లల్లో సికిల్‌సెల్ అనీమియా గుర్తించి వారికి అవసరమైన వైద్యసేవలు అందించడంతో పాటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. ఇలా జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళలతో పాటు కిశోర బాలికలను ఈ వైద్య పరీక్షల ద్వారా సంరక్షించేందుకు దోహదపడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి.

■

**సమాజం మచ్చికచేసిన జంతువే మనిషి ; న్యాయం,చట్టం అనేవే లేకుంటే మనిషిని మించిన క్రూర జంతువు మరి లేదు**

# బాలికలు భారం కాదు ... వారే ఆస్తి, ఆదుకునేవారు!

## జువైనల్ జస్టిస్ కమిటీ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ ధీరజ్‌సింగ్ ఠాకూర్

**బా**లికలు భారమనే ఆలోచన నుంచి తల్లిదండ్రులు బయటకు రావాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. ఆడపిల్లలు భారం కాదని, వారు మన ఆస్తి అని పేర్కొన్నారు. తల్లిదండ్రుల బాగోగులు చూసుకునే విషయంలో మగపిల్లల కంటే ఆడపిల్లలే మరింత మెరుగ్గా ఉన్నారని తెలిపారు. పిల్లల మధ్య తల్లిదండ్రులు ఎలాంటి లింగభేదాన్ని చూపించకుండా సమానత్వం చూపించాలని, ఆడ, మగ సమానమనే భావన ఉండాలని అన్నారు. బాలికల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై టీనేజ్ యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన లేక యుక్త వయసులో చేసిన తప్పులకు వారు భవిష్యత్ కోల్పోతున్నారని చెప్పారు.

విజయవాడ తమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా బాలికల సంరక్షణ అంశంపై రాష్ట్రంలోని వివిధ రంగాల భాగస్వాములతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ (జేజేసీ) రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించింది. జస్టిస్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన, ప్రత్యేక అతిథిగా హాజరైన జస్టిస్ రేవతి మోహితి దరే, జేజేసీ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరీ, సభ్యులు జస్టిస్ వి.సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ చల్లా గుణరంజన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

అంతకుముందు బెథనీ చిల్డ్రన్ హోమ్ బాలికలు సీజే, జస్టిస్ రేవతి మోహితి దరే, జేజేసీ చైర్మన్, సభ్యులకు మొక్కలు బహూకరించారు. ఈ సందర్భంగా సీజే మాట్లాడారు. 'రాష్ట్రంలో బాలికలు, బాలుర అక్షరాస్యత విషయంలో వ్యత్యాసం కొనసాగుతోందని, గణాంకాలు పరిశీలిస్తే బాలుర అక్షరాస్యత 73 శాతం ఉంటే, బాలికలది 59 శాతంగానే ఉందని, ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలతో జూనియర్ సివిల్ జడ్జి నియామకాల్లో ఇటీవల మహిళా న్యాయాధికారుల సంఖ్య పెరిగింది. ఆడబిడ్డ భారం కాదు... ఆస్తి అని తల్లిదండ్రులు గుర్తించిన కారణంగానే ఈ మార్పు సాధ్యమైంది. కుటుంబ సభ్యులకు బాగా సన్నిహితంగా మెలిగే వారే బాలికలపై అకృత్యాలకు పాల్పడుతున్నారని క్రైం బ్యూరో రిపోర్ట్ ద్వారా స్పష్టమవుతోందని, వక్ర బుద్ధి కలిగిన సన్నిహితులనుంచి కూడావారిని కాపాడుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. చిన్నారుల రక్షణ విషయంలో ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1098 పనితీరును ఆయన ప్రశంసించారు. సదస్సులో పలువురు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

### బాలురతో సమాన అవకాశాలు: జస్టిస్ రేవతి

**జ**స్టిస్ రేవతి మాట్లాడుతూ.. బాలురతో సమానంగా బాలికలకూ సమాన అవకాశాలు కల్పించాలని, వారికి సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టంచేశారు. పోక్సో, బాల్యవివాహ నిషేధ చట్టం, ఇతర చట్టాల అమలు విషయంలో పోలీసు అధికారులు, న్యాయాధికారులు మరింత సున్నితత్వంతో వ్యవహరించినప్పుడే బాలికలు ధైర్యంగా ముందుకొచ్చి వారికి జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. బాలికల కలలను ఆదిలోనే తుంచివేయకుండా.. అవి సాకారమయ్యేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జేజేసీ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరీ తెలిపారు. 'అమ్మాయిలను రక్షించడం దాతృత్వం కాదు. దేశ పురోగతికి అది పెట్టుబడి' అని వివరించారు. బాలిక అంటే ఓ కుమార్తె కాదని, సమర్థ నాయకురాలు, శిక్షకురాలు, సృష్టికర్త, వినూత్న వ్యక్తి అని జస్టిస్ వి.సుజాత తెలిపారు.

(ఫోటో: హాన్స్ ఇండియా, వార్త: ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ■

# మూడేళ్ళకే శరవేగంతో గుర్రంకొండ ఎఫ్ పి ఓ ప్రగతి!

– డా.భార్గవి

రైతుల సమస్యలను పరిష్కరించి, వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మార్కెట్ దొరికేలా చేసి,వారి ఆదాయాన్ని పెంచడమే రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్ పి ఓ ల) ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్యంతోనే ఏపిమాస్ఆధ్వర్యంలో, నాబార్డ్ ఆర్థిక సహకారంతో గుర్రంకొండ ఎఫ్ పి ఓఏర్పాటైంది. 16 గ్రామ పంచాయతీలకు చెందిన 503 మంది రైతులు వాటాదారులుగా వున్నారు. వీరిలో 220 మంది (44 శాతం)



మహిళా రైతులు. ఏడుగురు పాలక వర్గ సభ్యులు, ముగ్గురు సిబ్బంది వున్నారు. 12-10-2022 న ఏర్పాటైన ఈ ఎఫ్ పి ఓ చాలా తక్కువ సమయంలోనే గణనీయమైన పురోగతి సాధించి, వ్యాపార పరంగా ఇతర ఎఫ్ పి ఓలకు ఆదర్శంగా నిలిచింది. గుర్రంకొండ ఎఫ్ పి ఓ తన మూడవ వార్షిక మహాసభను ఘనంగా జరుపుకుంది. ఈ సమావేశంలో ఎఫ్ పి ఓ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, సభ్య రైతులు, సిబ్బంది, ఆహ్వానితులు పాల్గొన్నారు.

సభలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయం-ఖర్చుల లెక్కలు, వ్యాపార పురోగతి సభ్యులకు అందించిన సేవలపై సమగ్ర నివేదికను సమర్పించారు. అలాగే, ఎఫ్ పి ఓ ద్వారా చేపట్టిన వ్యాపార కార్యకలాపాల ఫలితాలను సభ్యుల ముందుంచారు. ఈ సందర్భంగా డైరెక్టర్ల బృందం రైతులకు మరింత మద్దతు అందించేందుకు తీసుకున్న కొత్త నిర్ణయాలను తెలియజేసింది. భవిష్యత్ ప్రణాళికల్లో రైతులకు నాణ్యమైన ఇన్పుట్లు అందించడం, మార్కెట్ అనుసంధానాలను బలోపేతం చేయడం, సహకారంతో వ్యాపార విస్తరణ వంటి అంశాలను ప్రస్తావించారు.

సభలో పాల్గొన్న సభ్యులు ఎఫ్ పి ఓ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరింత చురుకైన భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించాలని సంకల్పించారు.

ఈ మూడవ వార్షికసభ ద్వారా గుర్రంకొండ ఎఫ్పిఓ, తన సభ్య రైతుల అభివృద్ధి దిశగా నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని, మరింత విజయవంతమైన భవిష్యత్తు వైపు అడుగులు వేస్తోంది.

**అభివృద్ధి పరుగులు**

గుర్రంకొండ ఎఫ్ పి ఓ వ్యాపారం ప్రతి సంవత్సరం వేగంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. టర్నోవర్‌లో వృద్ధి ఇలా ఉంది:

- 2023 (ఆర్థిక సంవత్సరం): రూ. 2.26 లక్షల వ్యాపారం
- 2024 (ఆర్థిక సంవత్సరం): రూ. 49.85 లక్షల వ్యాపారం
- 2024 (ఆర్థిక సంవత్సరం): రూ. 102.02 లక్షల వ్యాపారం

మొదటి సంవత్సరం చిన్న స్థాయిలో ప్రారంభమైన వ్యాపారం, రెండవ ఏడాదికల్లా 20 రెట్లు పెరిగి, మూడవ ఏడాదికల్లా రెట్టింపు కన్నా మించికోటి రూపాయల మార్క్ దాటింది. ఇది గుర్రంకొండ ఎఫ్ పి ఓసుస్థిరమైన వృద్ధికి నిదర్శనం.

**విజయానికి దారితీసిన అంశాలు**

**1. ఏపిమాస్ సాంకేతిక సహకారం**

ఆమోదయోగ్యం కాని అవకాశం కంటె ఇష్టమైన దాంట్లో వైఫల్యమే మేలు

- ➪ ఎఫ్ పి ఓ నిర్వహణలో, ఆర్థిక ప్రణాళికలో, సామర్థ్య వృద్ధిలో ఏపిమాస్ కీలక పాత్ర పోషించింది.
- ➪ రైతులను శిక్షణ ఇచ్చి, ఆధునిక పద్ధతులు, మార్కెటింగ్ పద్ధతులపై అవగాహన కల్పించింది.

**2. నాబార్డ్ ఆర్థిక మద్దతు**

- ➪ ఎఫ్ పి ఓస్థాపనకు అవసరమైన ప్రాథమిక నిధులు నాబార్డ్వారా అందాయి.
- ➪ దీనివల్ల ప్రారంభ దశలోనే రైతులు ధైర్యంగా వ్యాపారంలో అడుగు పెట్టగలిగారు.

**3. రైతుల భాగస్వామ్యం**

- ➪ గుర్రంకొండ పరిసర ప్రాంతాల రైతులు తమ ఉత్పత్తులను (మొక్కజొన్న, టమాట మరియు అల్లనేరేడు) సమిష్టిగా విక్రయించడం ప్రారంభించారు.
- ➪ వ్యక్తిగతంగా విక్రయిస్తే వచ్చే నష్టాలను తప్పించుకుని, పెద్ద ఎత్తున అమ్మకాల ద్వారా లాభం పొందగలిగారు.

4. రైతు సమృద్ధి సేవా కేంద్రం (ఎఫ్ డి సి)ద్వారా రైతులకు అవసరమయ్యే అన్నీ ఇన్పుట్స్ సరసమైన ధరలకే అందుబాటులో ఉంచారు.

- ➪ పశువుల దాణా, టార్పాలిన్లు, స్ప్రేయర్లు, మల్చింగ్ షీట్లు, పురి, డ్రిప్లేడర్లు, కౌ-మ్యాట్లు, సేంద్రీయ, రసాయినిక ఎరువులు, విత్తనములు, పురుగు మందులు మొదలగునవి అందుబాటులో వున్నవి.

  దీంతో రైతులకు మంచి ధర లభించింది మరియు ఖర్చు తగ్గింది.

**ప్రభావం**

- ➪ ఆర్థిక ప్రభావం : రైతుల ఆదాయం పెరిగింది. చిన్న రైతులు కూడా స్థిరమైన లాభం పొందుతున్నారు.
- ➪ సామాజిక ప్రభావం : గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొత్త చైతన్యం వచ్చింది. మహిళలు, యువత కూడా ఎఫ్ పి ఓ కార్యక్రమాల్లో భాగమవుతున్నారు.
- ➪ ప్రేరణాత్మక ప్రభావం : గుర్రంకొండ ఎఫ్ పి ఓ మోడల్ను చూసి సమీప ప్రాంతాల రైతులు కూడా సంఘాలుగా ఏర్పడుతున్నారు.

**సవాళ్లు**

- ➪ వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం వంటి సహజ సమస్యలు.
- ➪ పెద్ద మార్కెట్లలో పోటీ.
- ➪ మరిన్ని రైతులను చేర్చుకోవాల్సిన అవసరం.

**భవిష్యత్ ప్రణాళికలు**

- ➪ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి అధిక విలువతో మార్కెటింగ్ చేయడం.
- ➪ మరిన్ని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి మార్కెట్లతో అనుసంధానం.
- ➪ రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులపై నిరంతర శిక్షణ.

గుర్రంకొండ ఎఫ్ పి ఓ, నాబార్డ్ నిధులు, ఏపిమాస్ మార్గ దర్శకత్వంతో మూడు సంవత్సరాల్లోనే కోట్ల స్థాయిలో వ్యాపారం చేయడం ద్వారా ఆదర్శప్రాయమైన విజయాన్ని సాధించింది. ■

## మహిళల భద్రతకు శక్తి యాప్!

**త**మ భద్రతకు మహిళలు శక్తి యాప్ వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్పై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు పిర్యాదు చేసేందుకు శక్తి వాట్సాప్ 7993485111ను ఫోన్లో సేవ్ చేసుకోవాలన్నారు. అలాగే 112, 1091, 1098, 181, 1930 నంబర్లకు డయల్ చేయొచ్చని మహిళల భద్రతకు పోలీసులు కృషి చేస్తారన్నారు.

గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం సమాచారాన్ని ఈగల్ టీం టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ■

# భూమి సంపద, ఆదివాసి ఎఫ్ పి ఓల వార్షిక మహాసభలు

– జి. శ్రీనివాస్

రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఓలు) గ్రామీణ వ్యవసాయ అభివృద్ధి, రైతుల ఆర్థిక బలోపేతానికి ఒక బలమైన వేదిక. సభ్యుల భాగస్వామ్యం, బోర్డు నాయకత్వం, ఆడిట్ పారదర్శకత, వ్యాపార ప్రణాళిక మరియు వ్యాపారం ఈ నాలుగు మూలస్థంభాలు కలిసినపుడే ఒక ఎఫ్‌పిఓ శక్తివంతంగా ముందుకు సాగుతుంది.

ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలోని రెండు మండలాల్లో జరిగిన భూమి సంపద ఎఫ్‌పిసి వార్షిక మహాసభ (నార్నూర్) మరియు ఆదివాసి గిరిజన ఎఫ్‌పిసి ఎజీఎం (సిర్పూర్) ఈ సత్యాన్ని మరోసారి ప్రతిబింబించాయి. ఈ రెండు వార్షిక మహాసభల్లో ఏపిమాస్ సిబ్బంది ప్రత్యక్షంగా పాల్గొని, సభ్యులను ప్రోత్సహించడం, సమస్యలను గుర్తించడం, మరియు వ్యూహాత్మక మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా ఒక ఆదర్శాన్ని నెలకొల్పింది.

**భూమిసంపద ఎఫ్ పి సి వార్షిక మహాసభ – నార్నూర్**

2025 సెప్టెంబర్ 19న, ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుండాల గ్రామంలో భూమి సంపద ఎఫ్‌పిసి యొక్క 4వ వార్షిక సాధారణ సభ ఘనంగా జరిగింది. ఈ సంస్థ 2021లో స్థాపించబడింది, ప్రస్తుతం 354 మంది సభ్యులు ఉన్నారు. వార్షిక మహాసభలో 110 మంది షేర్‌హోల్డర్లు హాజరయ్యారు. వీరిలో చాలామంది మహిళలు. ఇది గ్రామీణ మహిళలు కూడా ఎఫ్‌పిఓ లలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారనే సంకేతాన్ని ఇస్తుంది.

**చర్చించిన అంశాలు:**

- ➪ గత ఏడాది సాధించిన విజయాలు / కార్యక్రమాలు
- ➪ ఆడిట్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ల ఆమోదం
- ➪ 2025–26 సంవత్సరానికి వ్యాపార ప్రణాళిక సిద్ధం చేసి ఆమోదించడం
- ➪ ఎఫ్‌పిఓ సరఫరా చేసే ఇన్‌పుట్స్ ధరలపై సభ్యుల ఆందోళనలు వినడం

**ఏ జి ఎం లో తీసుకున్న నిర్ణయాలు:**

1. ప్రతి నెల రైతు ఉత్పత్తిదారుల సంస్థ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం
2. బోర్డు సభ్యుల ఎన్నికల కోసం మూడు గ్రామాలను గుర్తించడం, నూతన సభ్యుల ఎంపిక
3. ప్రతి పంచాయతీ నుంచి ఒక ప్రతినిధిని నూతన సభ్యులను మోబిలైజ్ చేయడానికి ఎంపిక చేయడం, బాధ్యత ఇవ్వటం
4. కొత్త బోర్డు సభ్యుల ద్వారా ఎన్నిక నిర్వహించటం
5. యం ఎస్ పి ప్రొక్యూర్‌మెంట్ అవకాశాలను పరిశీలించడం
6. సీఈఓ నియామకానికి ప్రాధాన్యం ఇవ్వడం
7. క్రెడిట్ సేల్స్ లేకుండా నగదు రూపంలో వ్యాపారం చేయటం

**సభలో వచ్చిన సూచనలు:**

- ➪ వార్షిక మహాసభలకు ముందే గ్రామస్థాయి సమావేశాలు పెట్టడం
- ➪ వ్యవసాయ సీజన్‌లో సమయాన్ని పరిగణనలోకి తీసుకుని వార్షిక మహాసభ నిర్వహించడం
- ➪ ముఖ్యంగా మక్కజొన్న కోత సీజన్లో ఏజీఎంలను ఉదయం 11 గంటల లోపు పూర్తి చేయడం

ఈ ఏ జీ ఎం, భూమి సంపద ఎఫ్ పి సి భవిష్యత్తులో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా పని చేయడానికి పునాదులు వేసింది.

**ఆదివాసి గిరిజన ఎఫ్ పి సి మహాసభ – సిర్పూర్ (యు)**

- ➪ 2025 సెప్టెంబర్ 18న, సిర్పూర్ (యు) మండలం లోని ఆదివాసి గిరిజన ఎఫ్ పి సి యొక్క 4వ వార్షిక

ఆరడుగుల మనిషి విలువ నాలుగంగుళాల నాలుకపై ఆధారపడి వుంటుంది

మహాసభ నిర్వహించబడింది. 2021లో స్థాపించ బడిన ఈ ఎఫ్‌పిఓ ప్రస్తుతం 302మంది సభ్యులు (6 పంచాయతీలకు చెందిన వారు) మరియు 12 బోర్డు సభ్యులు కలిగి ఉంది. గత ఆర్థికసంవత్సరంలో ఎఫ్‌పిఓ రూ. 16 లక్షల వ్యాపారం చేసినప్పటికీ, మేనేజ్‌మెంట్ గ్రాంట్ రూ. 3.8 లక్షలు విడుదల కావాల్సి ఉంది.

**వార్షిక మహాసభలో పాల్గొన్న ముఖ్యులు:**

ఎఫ్ పి సీ సభ్యులతో పాటు స్థానిక మండల వ్యవసాయ అధికారి ఏ ఓ, సర్పంచ్ తదితరులు కూడా వార్షిక మహాసభలో హాజరై, ఆర్గానిక్ కాటన్ ఉత్పత్తిలో సభ్యులను ప్రోత్సహిస్తూ, ఎఫ్ పి ఓకి మద్దతు ఇవ్వడానికి హామీ ఇచ్చారు.

**ఏ జీ ఎంలో తీసుకున్న నిర్ణయాలు:**

1. గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించడం
2. బోర్డు ఎన్నికల కోసం మూడు ప్రధాన గ్రామాలను గుర్తించడం
3. ప్రతి పంచాయతీకి ఒక ప్రతినిధిని నియమించడం
4. మక్కజొన్న, పప్పుల మార్కెటింగ్ అవకాశాలను పరిశీలించడం
5. సమన్వయం కోసం ఒక పాయింట్ పర్సన్‌ని నియమించడం

**అక్టోబర్ 2025లో చేయవలసిన చర్యలు:**

- వాటాదారుల సంఖ్యను 500కు పెంచడం
- రెండవ విడత ఈక్విటీ గ్రాంట్ కోసం దరఖాస్తు చేసి పొందటం
- ఫైనాన్షియల్ ఇన్స్టిట్యూషన్ల నుండి రెండవ లైన్ ఆఫ్ క్రెడిట్ పొందడం
- ఓ ఎన్ డి సి ప్లాట్‌ఫామ్‌లో ఆన్‌లైన్‌ట్రేడింగ్ ప్రారంభించడం
- వార్షిక వ్యాపార ప్రణాళిక ప్రకారం వ్యాపార టర్నోవర్ పెంచడం

**భవిష్యత్ దిశ**

భూమిసంపద ఎఫ్ పి సి (నార్నూర్) మరియు ఆదివాసి గిరిజన ఎఫ్ పి సి (సిర్పూర్ ఉ) వార్షిక మహాసభలు చూపించిన అంశం స్పష్టంగా ఒకటే ఎఫ్ పి ఓలు స్వయం నియంత్రణతో ముందుకు సాగితేనే రైతుల శక్తి పెరుగుతుంది.

ఏపిమాస్ టీం ఫీల్డ్ విజిట్లు, ఏ జి ఎంల్లో చురుకైన భాగస్వామ్యం, బోర్డు సభ్యులతో చర్చలు, సమస్యల గుర్తింపు, వ్యూహాత్మక మార్గదర్శకాలు అన్ని కార్యక్రమాలు కలసి ఎఫ్ పి ఓ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. ముఖ్యంగా మహిళా సభ్యుల చురుకైన పాల్గొనడం గ్రామీణ మహిళా సాధికారతకు ఒక శక్తివంతమైన సూచిక.

ఈ వార్షిక మహాసభలలో చర్చించిన నిర్ణయాలు అమలు చేస్తే, భవిష్యత్తులో ఈ రెండు ఎఫ్ పి ఓలు ఆర్థికంగా మరింత బలపడతాయి, రైతులకు నమ్మకమైన వేదికగా నిలుస్తాయి, మరియు సమూహ శక్తి ద్వారా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తాయి. ఏపిమాస్ దృష్టిలో పర్యవేక్షణ, భాగస్వామ్యం మరియు ప్రణాళిక ఉంటె అవి ఒక మంచి సమర్థవంతమైన ఎఫ్ పి ఓలు. ఇదే రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత, గ్రామీణ అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే మార్గం.

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఏపిమాస్ సహకారం అందిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థలు మొత్తం 14 అందులో గత మాసం కొన్ని వార్షిక మహాసభలు జరిగాయి. మరియు ఈ మాసంలో కూడా విగిలిన వాటికి వార్షిక మహాసభ నిర్వహించటం జరిగింది. ఇందులో ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి సిబ్బంది కూడా పైన పేర్కొన్న ఎఫ్‌పిఓ మహాసభ లకు హాజరావ్వటం జరిగింది.

హాజరైన ఏపిమాస్ టీం శ్రీమతి రామలక్ష్మి – ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, శ్రీ మురళి జాజున – డైరెక్టర్, శ్రీ రాజేశ్వర్ – ప్రాజెక్ట్ మేనేజర్, శ్రీ రాజేంద్ర రెడ్డి –టెరిటరీ మేనేజర్, శ్రీ ఆదిత్య – ప్రోగ్రాం ఆఫీసర్–యం ఐ ఎస్, శ్రీ వేదప్రకాశ్ – ప్రాజెక్ట్ మేనేజర్, శ్రీ జి శ్రీనివాస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్, నార్నూర్ మండలాల్లోని రెండు ఎఫ్‌పిఓల వార్షిక మహాసభలలో పాల్గొనడం ద్వారా మహిళా సాధికారత దిశగా తమ కృషిని కొనసాగించారు. ■

# ఇంటి పైకప్పు వర్షపు నీటి సేకరణపై శిక్షణ

– రాజోజుల బ్రహ్మాచారి

**ఇం**టి పైకప్పు పై నిలిచే వర్షపు నీటి సేకరణపై శిక్షణ, అవగాహన పర్యటన కార్యక్రమం కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా, హెచ్.డి కోటే –హ్యాండ్ పోస్ట్ లోని 'మై కాప్స్' శిక్షణ కేంద్రంలో సెప్టెంబర్ 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగింది. వాటర్ ఆర్గ్ ప్రతినిధి శ్రీమతి స్నేహా కరుణానిధి ఆధ్వర్యంలో ఏపిమాస్ వాష్ బృంద సభ్యులు శ్రీ కరి శ్రీనివాస్, శ్రీ రాజోజుల బ్రహ్మాచారి, శ్రీమతి కంతల రాణి, శ్రీమతి రోజ్‌మేరి, శ్రీ సత్యనారాయణ, శ్రీమతి సత్యవతి, శ్రీమతి చంద్రకాంతం, శ్రీమతి అనిత, శ్రీ ప్రవీణ్, శ్రీమతి లక్ష్మీదేవి ఈ శిక్షణలో పాల్గొన్నారు.

శిక్షణ మొదటిరోజున మై కాప్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ అష్రాఫుల్ హసన్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి, కుటుంబ భద్రత, జీవనోపాధి అవకాశాల పెంపు, వ్యవసాయ ఆధునికీకరణ వంటి అంశాలు సమాజంలోని ప్రతి కుటుంబానికి చాలా అవసరమన్న అవగాహనతో, ఈ అవసరాలను దృష్టిలో వుంచుకుని 'మై కాప్స్' (మైరాడ కావేరి ప్రాదేశిక సమితి) స్వచ్ఛంద సంస్థ 1983లో మైసూరు జిల్లా, చామరాజ నగర్ తాలూకాలో ఏర్పాటైందన్నారు. మైకాప్స్ బాలల హక్కుల పరిరక్షణ, గ్రామీణ పాఠశాలల అభివృద్ధి, త్రాగునీటి సరఫరా, వ్యవసాయ సాంకేతికత అభివృద్ధి, స్వయంసహాయ సంఘాల ఏర్పాటు వంటి కార్య క్రమాల్లో చురుకైన పాత్ర పోషించిందని శ్రీ అష్రాఫుల్ హసన్ తెలిపారు. ప్రధానంగా ఆరోగ్య భద్రత, స్త్రీ–పురుష సమానత్వం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్స హించడం, పర్యావరణపరిరక్షణ, గ్రామీణయువతకు ఉపాధి కల్పించడం, గ్రామస్థాయి సంస్థలను బలోపేతం చేయడం వంటి అంశాలపై తమ సంస్థ దృష్టి కేంద్రీకరించి నట్టు ఆయన చెప్పారు. సంస్థ ప్రధాన కార్యక్రమాల వివరాలు:

- ⇨ సేంద్రియ వ్యవసాయం – పత్తి, పసుపు, సిరిధాన్యాలు, కూరగాయల వంటి పంటలలో సేంద్రియ పద్ధతుల ప్రోత్సాహం.
- ⇨ పత్తి సాగులో మెరుగైన ప్రక్రియ – పత్తి రైతులకు ఆధునిక శిక్షణ, తెగులు నిర్వహణ.
- ⇨ ఎఫ్ పి ఓ ల ఏర్పాటు – వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్ పి ఓ లను) ఏర్పాటుచేసి, సమూహ మార్కెటింగ్ సౌకర్యం.
- ⇨ నీటి సంరక్షణ – 227 చెరువుల పునరుద్ధరణ.
- ⇨ విద్య, ఆరోగ్యం–పాఠశాలల మరమ్మత్తులు, లాబొరేటరీలు, మొబైల్ ఆరోగ్య శిబిరాలు, మరుగుదొడ్ల నిర్మాణం.
- ⇨ వాటర్ షెడ్ అభివృద్ధి – హెచ్.డి. కోటె, పేరియాపట్న, నంజనగుడ్ తాలూకాల్లో వర్షపు నీటి సంరక్షణ. మొదలైన కార్యక్రమాలు అమలు చేయడం జరిగిందని చెప్పారు

ఇంటి పై కప్పు వర్షపు నీటి సేకరణ (ఆర్ ఆర్ డబ్ల్యు హెచ్ ఎస్) ప్రాముఖ్యత, అమలు పద్ధతుల గురించి శ్రీ హెచ్.సి. శివశంకర్ వివరించారు. ప్రస్తుతం నీటి కొరత ప్రధాన సమస్యగా మారుతోందని, ఈ సమస్యను అధిగమించేందుకు వర్షపు నీటి సేకరణ (రెయిన్ హార్వెస్టింగ్) ఎంతో ఉత్తమమైన పద్ధతిగా నిలుస్తోందని, వర్షపు నీటిని సేకరించి, శుద్ధి చేసి, తాగునీటి అవసరాలకు ఉపయోగించడం ద్వారా మనం నీటి కొరతను తగ్గించవచ్చు నని చెప్పారు.

**ప్లానింగ్ సమయం :**

వర్షాకాలం ప్రారంభానికి ముందు ఏప్రిల్ లేదా మే నెలల్లో ఈ ప్రక్రియకు ప్రణాళిక రూపొందించి, అమలు చేయాలి. గ్రామపంచాయతీ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలి.

ఇసుక, సిమెంట్, ఇటుకలు, పీవీసీ పైపులు వంటి సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. సంవత్సరానికి కనీసం 500 మిల్లీమీటర్ల వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఈ పద్ధతి అనువైనది అని శ్రీ శివశంకర్ చెప్పారు.

అనంతరం విశ్రాంత ఇంజనీర్ శ్రీ రమేష్ మాట్లాడుతూ, ఆర్ ఆర్ డబ్ల్యు హెచ్ ఎస్ వ్యవస్థ ప్రయోజనాల గురించి వివరించారు. భూగర్భ జలాల నాణ్యత మెరుగుదల, బావులు, బోర్‌వెల్స్‌లో నీటి మట్టం పెంపు, మట్టి కోసుకుపోవడం తగ్గింపు, వర్షాభావ ప్రభావం తగ్గింపు, ఇంధన వినియోగం ఆదా (అంటే, బావులు, బోర్‌లలో ఎంతో లోపలి నుంచి నీటిని పైకి తీసే ఖర్చు తగ్గుతుంది) అవుతాయని చెప్పారు. ఆర్ డబ్ల్యు హెచ్ వ్యవస్థ రూపకల్పనకు, నిర్వహణకు గటర్లు, పైపులు, ఫిల్టర్లు, ఫస్ట్ ఫ్లష్ డివైజ్, స్టోరేజ్ ట్యాంక్స్ వుండాలని చెప్పారు. తక్కువ ఖర్చుతో వర్షపు నీటి నిల్వ పద్ధతులను గురించి వివరించారు.

కుటుంబ సభ్యుల సంఖ్య, స్థలం పరిస్థితి, ఇంటి పైకప్పు స్థితిని బట్టి ఈ పద్ధతులు మారుతాయని, వర్షపు నీటిని తాగునీటిగా ఉపయోగించడానికి ముందు శుద్ధి చేయడం చాలా ముఖ్యమని అన్నారు. మార్కెట్లో వివిధ రకాల ఫిల్టర్లు అందుబాటులో ఉన్నాయని, కోనికల్ మెష్ ఫిల్టర్‌లు, ఫిల్టర్ కలిగిన రింగ్ ట్యాంకులు, నైలాన్, స్పాంజ్‌లతో స్థానికంగా, తక్కువ ఖర్చుతో రూపొందించే ఆటోమాటిక్ ఫిల్టర్లను ఉపయోగించాలని చెప్పారు.

రెండవ రోజున శ్రీ మహాదేవయ్య మాట్లాడుతూ, 2004 సంవత్సరంలో మైసూరు జిల్లా హెచ్.డి.కోటే తాలూకాలోని బసాపుర, గెండతూరు గ్రామాలలో చేపట్టిన వర్షపు నీటి సేకరణ ఒక విజయవంతమైన మోడల్ అని చెప్పారు.

బసాపుర, గెండతూరు గ్రామాలు, కబినీ బ్యాక్ వాటర్, అటవీ ప్రాంతాల సరిహద్దు గ్రామాలు. ఈ గ్రామాలను ఎన్నో ఏళ్ళుగా తాగునీటి సమస్య వేధించేది. యిక్కడ బోర్ బావుల నీరు తాగడానికి అనువుగా ఉండేది కాదు (హార్డ్ వాటర్).

గ్రామస్తులు నదిలో నుంచి నీరు తెచ్చుకునేందుకు 2 కిలోమీటర్ల దూరం నడవాల్సి వచ్చేది. నది నీటిని తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎక్కువ అయ్యేవి, ముఖ్యంగా పిల్లలు తరచూ అనారోగ్యానికి గురి అయ్యేవారు. మహిళలు తమ రోజువారీ సమయంలో సగ భాగం నీరు తేవడంలోనే వెచ్చించాల్సి వచ్చేది. ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలు వైద్య చికిత్సకు ఖర్చు చేయలేక ఇబ్బందులు పడ్డాయి అని ఆ గ్రామాల పూర్వ స్థితిని ఆయన వివరించారు. ఈ కారణాల వల్ల గ్రామస్తులు కొత్త నీటి వనరుల పద్ధతులను స్వీకరించేందుకు ఆసక్తి చూపారు.

ఈ గ్రామాలలో సంవత్సరానికి 1000 మిల్లీమీటర్ల వర్షపాతం ఉండటంతో వర్షపు నీటి సేకరణ ఒక విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా పరిగణించబడింది. సి ఎ ఆర్ టి సంస్థ చవకైన, సులభమైన వర్షపు నీటి సేకరణ టెక్నాలజీని రూపకల్పన చేసింది. మైసూరు జిల్లా పరిషత్ ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహకారం అందించింది అని చెప్పారు.

మొదట 20 కుటుంబాలు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. క్రమంగా ఈ సంఖ్య 156 కుటుంబాలకు పెరిగింది, తద్వారా గెండతూరు గ్రామం కర్ణాటకలో మొదటి 100% వర్షపు నీటి గ్రామంగా నిలిచింది.

ప్రతి ఇంటికి వర్షపు నీటి సేకరణ వ్యవస్థ ఏర్పాటు ఖర్చు రూ. 15,000. గ్రామస్తులు శ్రమదానం, నగదు, వస్తు రూపంలో 20%, మైరాడ 10%, జిల్లా పరిషత్ 70% ఆర్థిక సహకారం అందించాయి. ఈ వర్షపు నీటి సేకరణ ప్రాజెక్టును పాఠశాలలకు విస్తరించి,128 పాఠశాలల్లోఅమలు చేసినట్టు శ్రీ మహాదేవయ్య చెప్పారు.

**గ్రామాల సందర్శన**

తర్వాత ఏపిమాస్ బృందం బసాపుర , గెండతూరు గ్రామాలను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడి , వర్షపు నీటి సేకరణ ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా చూసి, సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగింది.

రెండు రోజులలో నేర్చుకున్న, పరిశీలించిన అంశాలపై మూడవ రోజున బృంద చర్చ జరిగింది. వచ్చే మూడు సంవత్సరాలలో ఇంటి పై కప్పు వర్షపునీటి సేకరణపై ప్రణాళిక రూపొందించాము.

ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో అవగాహన, ప్రేరణ కలిగించిందని వాష్ బృంద సభ్యులు పేర్కొన్నారు. ఈ అవకాశం కలిగించిన సిఎస్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు. ■

**మనిషి స్వభావం మారడం కష్టం, మార్చాలనుకోవడం అవివేకం, అంతకంటె వారితో నీ తీరు మార్చుకో**

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రకు స్కోచ్ అవార్డు

**మ**న రాష్ట్రంలో జరుగుతున్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని, దానికి అత్యంత ప్రతిష్ఠాత్మక 'స్కోచ్ అవార్డు' లభించిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ శ్రీ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రంలో జరగని విధంగా ఒక రోజంతా ముఖ్యమంత్రి ప్రజల్లో ఉండే కార్యక్రమం మన రాష్ట్రంలోనే జరిగిందని, అందుకే ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. అలాగే, దేశంలోనే మొదటిసారిగా ఫస్ట్ సర్క్యులర్ ఎకానమీ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, ఫస్ట్ రీసైక్లింగ్ పార్కు కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు.



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ శ్రీ అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కొత్తగా 6 'వేస్ట్ టు ఎనర్జీ' ప్రాజెక్టులు రాబోతున్నాయని, వాటిలో రాజమండ్రి, నెల్లూరు, కడప, కర్నూలులోని 4 ప్రాజెక్టులకు వర్క్ ఆర్డర్లు జారీ చేశామని తెలిపారు.

**స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టుకు పురస్కారం**

స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్టులో భాగంగా 45 రోజుల్లో 1,600 ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసినందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ పురస్కారం లభించింది. ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ కన్వెన్షన్‌లో ఈ అవార్డును ఏపీఎస్పీడీసీఎల్ సీఈ శ్రీ సురేంద్రనాయుడితో కలిసి కలెక్టర్ శ్రీ వెంకటేశ్వర్ అందుకున్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రూ. 20.68 కోట్లతో ఎ.రంగంపేట, కందులవారిపల్లి, చిన్నరామాపురం గ్రామ పంచాయతీల్లోని 1,600 గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేశారు

**సీఎం అభినందనలు**

స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు తొలి సంవత్సరంలోనే స్కోచ్ గోల్డెన్ అవార్డుతో గుర్తింపు పొందడం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ అద్భుతమైన విజయానికి కారణమైన బృందాన్ని, ప్రతి వ్యక్తిని, కుటుంబాన్ని అభినందిస్తున్నానని అన్నారు. కేవలం 45 రోజుల్లోనే 1600 ఇళ్లలో సౌర ఫలకాలను ఉచితంగా ఏర్పాటు చేసి, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి దోహద పడిన ప్రతి ఒక్కరికీ ఈ అవార్డును అంకితమిస్తున్నట్లు ప్రకటించారు.

**మరి మూడు విభాగాల్లో ....**

మెరుగైన పనితీరు కనబరిచినందుకు మూడు విభాగాల్లో రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డులు లభించాయి. పోటీ పరీక్షల్లో బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందజేసినందుకు 'సోషల్ జస్టిస్ సెక్యూరిటీ' విభాగంలో ఏపీ బీసీ సంక్షేమ శాఖను బంగారు స్కోచ్ అవార్డు వరించింది. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీమతి ఎస్. సవిత స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్, ప్రొఫెసర్ మహేందర్ దేవ్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా 1,674 మందికి, ఆన్‌లైన్ ద్వారా మరో 4,774 మందికి ఉచిత శిక్షణ అందజేశామని వెల్లడించారు. వీరిలో 246 మంది మెగా డీఎస్సీలో టీచర్లుగా ఎంపికయ్యారన్నారు.

రాబోయే కాలంలో బీసీ యువతకు అన్ని పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందివ్వనున్నామని ప్రకటించారు. అమరావతి లో ఐదెకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ నిర్మించనున్నామని, విశాఖ, రాజమండ్రి, తిరుపతి, అనంతపురంలో మెగా బీసీ స్టడీ సర్కిళ్లను నిర్మించే ఆలోచన ఉందని సవిత తెలిపారు.

కాగా 'డిజిటల్ టికెట్ల జారీ ప్రక్రియ'ను విజయ వంతంగా అమలుపరచడం ద్వారా ఆర్టీసీ 'స్కోచ్' అవార్డును గెలుచుకుంది. సంస్థ వైస్ ఛైర్మన్, ఎండీ శ్రీ ద్వారకా తిరుమలరావు తరపున సంస్థ చీఫ్ ఇంజనీర్ (ఐటీ) శ్రీ వై.శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు.

సంస్థకు అవార్డు రావడం పట్ల ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) శ్రీ జి.వి.రవివర్మ అభినందనలు తెలియజేశారు. ఇక 'పేదరిక నిర్మూలనలో విశిష్ట సేవ'లకు 'ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ' (మెప్మా)కు స్కోచ్ ప్లాటినం అవార్డు లభించింది. మిషన్ డైరక్టర్ శ్రీ ఎన్. తేజ్‌భరత్ ఈ అవార్డును స్వీకరించారు. మెప్మా కృషికి గుర్తింపుగా 9 అవార్డులను ప్రదానం చేసింది.

**పట్టు పరిశ్రమ శాఖకు అవార్డు**

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సెంట్రల్ సిల్క్ బోర్డు 'మేరా రేషమ్-మేరా అభిమాన్' పేరుతో చేపట్టిన కార్యక్రమా లను సమర్థంగా నిర్వహించినందుకు రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖకు ఉత్తమ అవార్డు లభించింది.

అవార్డును బెంగుళూరులో కేంద్ర జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి పద్మినీ సింగ్లా, సభ్య కార్యదర్శి శ్రీ శివ కుమార్, కేంద్ర పట్టుమండలి సభ్యుడు. అనంతపురం ఎంపీ శ్రీ అంబికా లక్ష్మీనారాయణ నుంచి రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల డైరెక్టర్ శ్రీనివాసులు అందుకున్నారు.

'మేరా రేషమ్- మేరా అభిమాన్' కార్యక్రమం ద్వారా ఏపీలో పట్టు పురుగుల ఉత్పత్తిని పెంచడానికి, కొత్త రైతులతో మల్బరీ సాగుకు అవకాశం ఏర్పడిందని శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ ఈ ఏడాది రెండోసారి ఉత్తమ అవార్డు పొందింది. ■

## 13 వేల అడుగుల ఎత్తునుంచి దూకిన 71 ఏళ్ల బామ్మ !

**వ**యసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని కేరళకు చెందిన 71 ఏళ్ల లీలా జోస్ నిరూపించారు. చిన్నప్పటి నుంచి ఆకాశంలో పక్షిలా ఎగరాలని కలలుగన్న ఆమె, ఇటీవల తన చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. ఏకంగా 13,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసి, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన అత్యంత పెద్ద వయస్కురాలిగా రికార్డు సృష్టించారు.

కేరళలోని ఇడుక్కి జిల్లా, కొన్నతడికి చెందిన లీలా జోస్‌కు చిన్నప్పుడు తన ఇంటిపై నుంచి వెళ్లే విమానాలను



చూసి నప్పుడే స్కైడైవింగ్ చేయాలనే కోరిక పుట్టింది. ఇటీవల దుబాయ్‌లో సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తున్న తన కుమారుడు అనీష్‌ను కలిసేందుకు వెళ్లినప్పుడు తన కోరికను బయట పెట్టారు. మొదట తల్లి మాటలను అనీష్ తేలిగ్గా తీసుకున్నా, ఆమె పట్టుదలనుచూసి స్కైడైవింగ్‌కు ఏర్పాట్లు చేశాడు. ఇందుకోసం గైడ్, విమానం, వీడియో రికార్డింగ్‌తో సహా సుమారు రూ. 2 లక్షలు ఖర్చ యింది. 'గాల్లో తేలిపోతున్నప్పుడు భయం, ఆనందం రెండూ కలిగాయి' అని లీలా తన అనుభవాన్ని వివరించారు. 6,000 అడుగుల ఎత్తులో పారాచూట్ తెరుచు కున్నప్పుడు సురక్షితంగా కిందకు దిగుతాననే నమ్మకం కలిగిందని ఆమె తెలిపారు. తన తండ్రి, ఆర్మీ అధికారి అయిన మాణికుట్టి ఇచ్చిన ధైర్యమే తనకీ స్ఫూర్తి అని ఆమె పేర్కొన్నారు.

ఇటీవల హరియాణాలో 80 ఏళ్ల డాక్టర్ శ్రద్ధా చౌహాన్ కూడా 10,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసి రికార్డు సృష్టించారు. లీలా, శ్రద్ధా వంటి వారి సాహసాలు వయసుతో సంబంధం లేకుండా కలలను సాకారం చేసుకోవచ్చని ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయి. ■

# పిల్లల పెంపకంలో 'మృదు' స్పర్శ !

– జె వి క్రిష్ణమూర్తి




కుమారుడు నిశాంత్‌తో, హర్‌కీ పురస్కారంతో శ్రీమతి మృదుల

*దేవుళ్ళలో ప్రథమ పూజకు అర్హత గణేశుడిది. మనం దేవతలను పూజిస్తాం. కాని, ముక్కోటి దేవతలను నాలుగవ స్థానానికి పరిమితంచేసి, తొలి పూజార్హత పొందుతుంది తల్లి! ఆ తర్వాత తండ్రి. అనంతరం గురువు. ఆ తర్వాతనే ఏ దేవుడైనా, దేవత అయినా! ఇదీ భారతీయ సాంస్కృతిక వైభవం మాతృస్థానానికి యిచ్చిన మహోన్నత గౌరవం! అమ్మ, మాతృమూర్తి, తల్లి ... ఈ పదాలు వినగానే ఒళ్ళు పులకిస్తుంది! కాని, వివిధ కారణాలవల్ల, యిటీవలి కాలంలో ఈ మాతృపీఠం కొంత మసకబారుతున్నదేమో అనిపిస్తుంది. అయినా, ఎందరో తల్లులు నేటి మారిన సామాజిక పరిస్థితులలో, పెరిగిన బాధ్యతలలోకూడా తమ తల్లితనాన్ని కాపాడుకోవాలని, పిల్లలను చక్కగా పెంచాలని తల్లడిల్లిపోతున్నారు. స్వీయ అనుభవాలను దృష్టిలోవుంచుకుని, పలువురికి ఎదురయ్యే అలాంటి సమస్యలకు తమ పరిధిలో పరిష్కారాలు వెదుకుతున్నారు. మాతృత్వ మధురిమలు చెరిగిపోకుండా తమ వంతు కృషిచేస్తున్నారు. ఆ కోవకు చెందిన ఒక ఆదర్శ మాతృత్వ మార్గదర్శిని శ్రీమతి ఓరుగంటి మృదుల! పిల్లల పెంపకం పై సలహా,సంప్రతింపులకోసం 'పేరెంటింగ్ హబ్ ' పేరిట ఒక వాట్సప్ కమ్యూనిటీని ఏర్పాటుచేసి, ఎందరో మాతృమూర్తులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ విశిష్ట కృషికి గుర్తింపుగా మహిళల ఉద్యోగ, జీవన వికాస విస్తరణకు తోడ్పడే ప్రముఖ ' హర్ కీ ' సంస్థ నుంచి వరుసగా రెండేళ్ళుగా 'ప్రభావశీల మహిళల' విభాగంలో పురస్కారాన్ని అందుకున్నారు. ఆమెకు 'మహిళా సాధికారత' అభినందనలు .*

◆◆◆◆◆

శ్రీమతి ఓరుగంటి మృదుల ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన శ్రీ ఓరుగంటి మల్లిక్, శ్రీమతి సావిత్రీ దేవి దంపతుల కుమార్తె. తండ్రి నిబద్ధత కలిగిన జర్నలిస్ట్. 'యజ్ఞోపవీతం','సాయి సన్నిధి' మాస పత్రికలు, వాటి డిజిటల్ మాధ్యమాలను నిర్వహిస్తుంటారు. తల్లి ఆయనకు చేదోడువాదోడుగా వుంటారు. శ్రీ మల్లిక్ తండ్రిగారు కూడా జర్నలిస్టే. ఈ నేపథ్యంలో మానవీయ విలువలతో పెరిగిన మృదుల, ఎంటెక్ పూర్తిచేసి,కొంతకాలం మార్కాపురంలోని ఒక కాలేజీలో ఉద్యోగంచేశారు. ఇంజనీర్ శ్రీ కాజా విక్రమ్‌తో వివాహానంతరం ఆ దంపతులు చెన్నైలో స్థిరపడ్డారు. అక్కడ ఒక యూనివర్శిటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తుండగా ఆమెను మాతృత్వం వరించింది. నిశాంత్ జన్మించాడు. కాని, గృహిణిగా, ఉద్యోగినిగా, తల్లిగా...ముప్పేట బాధ్యతలతో సతమతమవుతూ, భర్త, అత్తగారి సహకారం వున్నప్పటికీ, బాబును కోరుకున్న విధంగా పెంచలేకపోతున్నానే అని తపనపడింది. ఉద్యోగం మానేద్దామని కూడా సిద్ధమైంది. అయితే, భర్త సలహాపై ఆ ఉద్యోగం మారి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా చేరింది. అయినా, పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. బాబును దండించకుండా ప్రేమ, ఆప్యాయతలతో, మంచి పౌరుడిగా పెంచడం ఎలా అనేది ఒక తీరని సమస్యగా ఆమెను వేధిస్తుండేది. 'అప్పుడే నిపుణుల సలహాలు తీసుకున్నాను. పిల్లల పెంపకంగురించి ఎన్నో పుస్తకాలు చదివాను. వాటి వల్ల చక్కని అవగాహన ఎర్పడింది. అత్తగారి సహాయం కూడా ఉపయోగపడింది. కఠినంగా వ్యవహరించకుండా, సున్నితంగా, మృదువుగా బాబుకు అనేక విషయాలను నేర్పించగలిగాను. బాబుతోపాటు నేను కూడా ఎదిగాను. అన్ని విధాల సంతృప్తిగా వుంది. పిల్లల పెంపకం విషయంలో నా మాదిరే ఎందరో తల్లులు యిబ్బంది పడుతుంటారన్న ఆలోచన వచ్చినప్పుడు, వారికి నేను తోడ్పడాలని ఆనిపించింది. ఆ సంకల్పంతోనే ఈ 'పేరెంటింగ్ హబ్ ' ను ప్రారంభించాను. ఇప్పుడు ఈ హబ్ కమ్యూనిటీలో 300 మందికి పైగా సభ్యులు వున్నారు. వారానికి ఒకసారి మేమంతా జూమ్ మీటింగ్‌లో కలుసుకుని, సమస్యలను చర్చించి, పరిష్కారాలను కనుగొంటున్నాం. ఇప్పుడు వారంతా వారి పిల్లలతో హాయిగా గడపగలుగుతున్నారు' అని శ్రీమతి మృదుల సంతోషం వ్యక్తంచేశారు. గత రెండేళ్ళుగా శ్రీమతి మృదుల జిగామన్ కంపెనీలో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా

సత్యం బాధాకరమైన చికిత్స లాంటిది, కాని అస్వస్థత పోతుంది, అసత్యం తక్షణ ఉపశమన ఔషధం, కాని దుష్ఫలితాలు ఎన్నో!

# పిల్లల అత్యుత్సాహంపై ఓ కన్నేయండి !

సెలవులు అనగానే పిల్లలకు ఎక్కడ పట్టలేని ఆనందం వస్తుంది. ఆ సమయంలో కాలక్షేపం కోసం వారు చేసే పనులు ఊహించని ప్రమాదాలకు దారి తీస్తుంటాయి. ఒక్కోసారి కన్నవారికి కడుపుకోతను మిగులుస్తాయి. ముఖ్యంగా వేసవి, దసరా, సంక్రాంతి సెలవులు అనేసరికి అధిక సమయం ఖాళీ దొరుకుతుంది. అప్పుడే పిల్లలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతుంటారు.

సాధారణంగా నీరు కనిపిస్తే పిల్లలకు ఈత కొట్టాలని పిస్తోంది. గ్రామీణ ప్రాంత పిల్లలకు ఎక్కువగా ఈత వస్తుంది. చిన్నప్పటి నుంచి పట్టణాలు, హాస్టళ్లలో ఉండే పిల్లలకు ఈత పెద్దగా తెలియదు. అటువంటి వారు గ్రామాలకు వచ్చి తోటి పిల్లలతో సరదాగా ఈతకు వెళుతుంటారు. ఈ క్రమంలో ఈత రాక ప్రమాదాలకు గురవుతుంటారు. అటువంటి వారి విషయంలో తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. సెలవులకు గ్రామాలకు వచ్చే పిల్లలకు ప్రమాదకర మైన చెరువులు, కాలువలు, కుంటల గురించి చెప్పాలి. అటువైపుగా వెళ్లినప్పుడు పెద్దవారి తోడు తీసుకొని వెళ్లాలని చెప్పాలి.

కొందరు పిల్లలు తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో ఉన్న వాహనాలను తీసుకొని రోడ్లపైకి వచ్చేస్తుంటారు. అర్ధరాత్రి లాంగ్ డ్రైవింగ్ అంటూ చేసే ప్రయాణాలు చేటు తెస్తున్నాయి. అతి వేగం కారణంగా జరుగుతున్న ప్రమాదాలు బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. ఒక్కోసారి వీరి కారణంగా ఎదుటి కుటుంబాలు సైతం వీధినపడుతున్నాయి. అందుకే పిల్లల చేతికి వాహనాలు ఇవ్వకపోవడమే శ్రేయస్కరం.

ఆన్‌లైన్ తరగతులు, అదనపు పరిజ్ఞానం కోసమంటూ చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల చేతిలో సెల్‌ఫోన్లు పెడుతుంటారు. దాంతో ఎంత ప్రయోజనమో చెప్పలేం కానీ అనర్థాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఫొటోల యాప్స్ మొదలు ఆన్‌లైన్ గేమ్స్ వరకూ అన్ని యాప్‌ల గురించి పిల్లలు తెలుసు కుంటున్నారు. సోషల్ మీడియాలో అకౌంట్లు తెరుస్తున్నారు. వారు నేర్చుకునే విషయాలు ఎటువైపునకు దారితీస్తాయో అనేది తల్లిదండ్రులు గ్రహించాలి. అందుకే పిల్లలకు అవసరం మేరకు మాత్రమే సెల్‌ఫోన్లు ఇవ్వాలి.

మరో ఆందోళనకరమైన విషయం మైనర్లు, విద్యార్థులు మత్తు బారినపడుతుండడం. స్నేహితుల్లో ఎవరికో ఒకరికి గంజాయి, డ్రగ్స్, సిగరెట్ అలవాటు ఉంటే మిగతా వారు ఆకర్షితులవుతున్నారు. సరదాగా ఒకసారి అనే మాటగా మొదలై, మత్తు అనే మాయలో పడేస్తోంది. అందుకే పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. (ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ■

---

పనిచేస్తున్నారు.

**బహుముఖ ప్రజ్ఞ**

ఆమె ఎన్నో కళాశాలలలో గెస్ట్ లెక్చరర్‌గా, విద్యార్థులకు మార్గదర్శనం చేస్తుంటారు. చిన్నారులకు వేసవి సెలవులలో అవగాహన తరగతులు నిర్వహిస్తుంటారు. ఐ టి రంగంలో వ్యక్తిత్వ వికాస ప్రసంగాలు చేస్తుంటారు. మహిళల సమస్యలపై స్వయంగా అనేక ప్రసంగాలివ్వడంతోపాటు, వివిధ రంగాల నిపుణుల ప్రసంగాలతో మహిళలలో స్ఫూర్తి నింపుతుంటారు.

**ఇతర అవార్డులు**

హర్ కీ సంస్థ నుంచి రెండేళ్ళుగా 'హర్ రైజింగ్' అవార్డు పొందడమే కాకుండా. శ్రీమతి మృదుల మరికొన్ని పురస్కారాలను కూడా పొందారు. అవి:

2019 లో జి హెచ్ సి ఐ వారి ఎమినెంట్ స్పీకర్ ఆవార్డు

2019 లో హెచ్ సి ఎల్ నుంచి హాన్‌ధన్ అవార్డు

2023,24 లో రెండుసార్లు జిగామన్ వారి 'ఇన్నొవేషన్ ఫెయిర్ విన్నర్' అవార్డు. తను పనిచేసే సంస్థలో ఉత్తమ ఉద్యోగినిగా ప్రశంసలు ... యిలా మరికొన్ని. పిల్లలకు బంగారు బాల్యాన్ని అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్న వీరి సత్సంకల్పాన్ని అభినందిద్దాం. తథాస్తు అని ఆశీర్వదిద్దాం. ■

# పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య !

*పెట్రోల్ బంక్‌లో మహిళా సిబ్బంది కనిపించడమే అరుదు. కానీ స్వయంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తూ లాభాలు ఆర్జిస్తూ... కొత్త వ్యాపారాలకు ప్రణాళికలు వేస్తున్నారు నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు. దేశంలోనే మొదటిసారిగా ఒక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌గా ఇది గుర్తింపు పొందింది.*

**మ**హిళలకు అవకాశం కల్పిస్తే ఏ పనినైనా సమర్థవంతంగా చేయగలరని నిరూపిస్తున్నారు. తెలంగాణలోని నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, గత ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వారు ప్రారంభించిన పెట్రోల్ బంక్ లాభాల బాటలో దూసుకుపోతోంది. మహిళలే నిర్వహించేలా ఒక పెట్రోల్ బంక్‌ను కేటాయించడం విశేషమే. దీని వెనుక కథేమిటంటే.. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ సమస్య వివిధ అంశాలపై అధ్యయనం చేసి, దాన్ని ముఖ్యమంత్రికి సమర్పించారు. దానిలోని అంశాల ఆధారంగా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సీఎం అనుమతించారు.

ఈ నేపథ్యంలో... నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తాలో డీఆర్‌డిఏ కార్యాలయం దగ్గర 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు కేటాయించారు. కిందటి ఏడాది సెప్టెంబర్లో భారత్ పెట్రోలియం సంస్థతో జిల్లా మహిళా సమాఖ్య ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం... 20 ఏళ్ల పాటు నెలకు రూ. 20 వేల అద్దె ప్రాతిపదికన సమాఖ్య ఈ పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తుంది. స్థలం రాష్ట్ర ప్రభుత్వానిది కాగా, మిగిలిన నిర్మాణపనులను భారత్ పెట్రోలియం సంస్థ పూర్తి చేసింది. దీనికి రూ13 కోట్లు ఖర్చు చేశారు. మహబూబ్‌నగర్-యాద్గిర్ (కర్నాటక) అంతర్రాష్ట్ర రహదారిలో ఏర్పాటైన ఈ పెట్రోల్ బంక్‌ను ఈ ఫిబ్రవరిలో సీఎం ప్రారంభించారు.

**కొనుగోళ్లు, నిర్వహణ అంతా వారే...**

ఈ బంకు సమాఖ్యకు చెందిన 11 మంది మహిళలు నిర్వహిస్తున్నారు. డీజిల్, పెట్రోలు కొనుగోళ్లు తదితరాలను వారే నిర్వహిస్తున్నారు. మేనేజర్‌కు నెలకు రూ.18 వేలు, పదిమంది మహిళలకు నెలకు రూ. 13 వేలు చొప్పున, వాచ్‌మేన్‌కు రూ.6 వేలు వేతనంగా సమాఖ్య చెల్లిస్తోంది. నిర్వహణకోసం సమాఖ్య ద్వారా రూ.35 లక్షలు పెట్టుబడి పెట్టినట్టు సభ్యులు తెలిపారు. వేతనాలు, నిర్వహణ ఖర్చులు పోనూ గత ఆరు నెలల్లో ఈ బంక్ రూ. 13.58 లక్షల లాభాన్ని సంపాదించింది. మరికొందరు మహిళలకు ఉపాధి కల్పించే విధంగా సీఎన్‌జీ గ్యాస్ సరఫరా, లేదా టీ, టిఫిన్ పాయింట్ ఏర్పాటు గురించి ఆలోచించాల్సిందిగా సభ్యులకు కలెక్టర్ శ్రీ సంచిత్ సంగ్వార్ సూచించారు.

**మొదట్లో ఇబ్బందులు పడ్డాం : అనిత**

**మొ**దట్లో పెట్రోల్, డీజిల్ వాహనాలకు వెయ్యడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కొన్నిరోజుల తర్వాత అలవాటు కావడంతో ప్రస్తుతం సాఫీగా పనులు సాగిస్తున్నాం. ఉదయం తొమ్మిది గంటల మంచి సాయంత్రం ఆరుగంటల వరకు విధులు నిర్వహిస్తున్నాం. ***- జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి***

**మహిళల ఆర్థిక ఎదుగుదలకు దోహదం: చంద్రకళ**

**మ**హిళలు వంటింటికే పరిమితం కాదని మా సమాఖ్య నిరూపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సహంతో పెట్రోల్ బంకు నిర్వహణ చేపట్టాం. 11 మంది మహిళలు కష్టపడి పని చేస్తున్నారు. మా బంక్‌కు జాతీయ స్థాయి పేరు రావడం సంతోషంగా ఉంది. ఈ ఆగస్టులో ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొని ప్రధాని నరేంద్రమోదీని కలుసుకున్న సందర్భాన్ని మరలిపోలేం. ***- పెట్రోల్ బంకు మేనేజర్***

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

**నమ్మితే మౌనం కూడా చక్కగా అర్థమవుతుంది, నమ్మకం లేకుంటే ప్రతి మాట అపార్థంగానే వినిపిస్తుంది**

# ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు వివిధ రాయితీలు అందిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలను, నిధులను ఉద్యాన శాఖ ప్రకటించింది. కొత్త తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటల సాగు కోసం 9,902 ఎకరాలకు రూ. 18.48 కోట్లు కేటాయించారు. అలాగే, కూరగాయల సాగు కోసం 10 వేల ఎకరాల లక్ష్యాన్ని సాధించడానికి రూ. 9.60 కోట్లు, 2,949 ఎకరాల్లో ఉల్లి సాగుకు రూ. 2.35 కోట్లు, 2,549 ఎకరాల్లో పూల సాగుకు రూ. 2.06 కోట్లు, 3,294 ఎకరాల్లో అల్లం, వెల్లుల్లి సాగుకు రూ. 5.33 కోట్లు కేటాయించారు. ఈ అన్ని విభాగాల్లో రైతులకు 40 శాతం రాయితీని నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తారు.

అదనంగా పుట్టగొడుగుల యూనిట్లకు రూ. 1.08 కోట్లు, పాత తోటల పునరుద్ధరణకు రూ. 2 కోట్లు, నీటి వనరుల సృష్టి కోసం రూ. 2.73 కోట్లు, ప్లాస్టిక్ మల్చింగ్ కోసం రూ. 14.24 కోట్లు కేటాయించారు. ఈ విభాగాలకు 40 నుంచి 50 శాతం వరకు రాయితీ లభిస్తుంది. అంతేకాకుండా, సేంద్రీయ సాగు, నర్సరీల ఏర్పాటు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పాలీహౌజ్‌లు, కోల్డ్ స్టోరేజీలు, సౌర పంట, ఎండబెట్టే యంత్రాల వంటి యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం 30 నుంచి 50 శాతం వరకు రాయితీ యిస్తున్నట్లు ఆ ప్రకటన తెలిపింది.

**యూరియా వాడకం తగ్గిస్తే రైతుకు బస్తాకు రూ. 800**

యూరియా వాడకం తగ్గించే దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అన్నదాతలకు శుభవార్త తెలిపారు. ప్రస్తుతం వాడుతున్న యూరియాను తగ్గిస్తే ప్రతి బస్తాకు రూ. 800 నేరుగా రైతుకు అందిస్తామని హామీ ఇచ్చారు. అంటే.. ఒక రైతు తన పంటకు ఈ ఏడాది నాలుగు బస్తాల యూరియా వినియోగించి, వచ్చే ఏడాది రెండు బస్తాలు మాత్రమే వాడితే ప్రతి బస్తాకు రూ. 800 చొప్పున రూ. 1600 వారి ఖాతాల్లో జమ చేస్తారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

వచ్చే ఏడాది నుంచి రైతులు యూరియా వాడకం ఏ మేరకు తగ్గిస్తే ఆ మేరకు ప్రోత్సాహం ఇస్తామని ప్రకటించారు. రైతులు ఎక్కువ ఎరువులు వాడుతుండడంవల్ల మనదేశంనుంచి దిగుమతి చేసుకున్న మిరపను చైనా తిప్పి పంపిందని, ఇలాంటి పరిస్థితి అక్వాలోనూ జరిగిందని శ్రీ చంద్రబాబు తెలిపారు. ఈ కారణంగానే కొన్ని యూరప్ దేశాలు మన ఉత్పత్తుల ధరలు తగ్గిస్తున్నాయని చెప్పారు. ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయని, తీసుకునే ఆహారంలో కార్బొహైడ్రేట్స్ తగ్గిస్తున్నారని, ప్రజలు తినే వెరైటీ పంటలు వేయాలని కోరారు. రాయలసీమలో మల్టీ కల్చర్, కోస్తాలో హార్టీకల్చర్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని దిశా నిర్దేశం చేశారు సీఎం చంద్రబాబు.

**కోటి 20 లక్షల మందితో కూడిన అతిపెద్ద మహిళా సైన్యం**

మహిళా సాధికారత కోసం తీసుకొచ్చిన డ్వాక్రా సంఘాలు మరింత ఎత్తుకు ఎదగాలని ఏపీ సీఎం శ్రీ చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. పొదుపు చేసి దాచుకున్న డబ్బులతో పాటు రివాల్వింగ్ ఫండ్ ద్వారా మహిళాసంఘాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని సీఎం అన్నారు. డ్వాక్రా సంఘాల రూపంలో కోటి 20 లక్షల మందితో కూడిన అతి పెద్ద మహిళా సైన్యం రాష్ట్రానికి ఉందని అన్నారు.

మహిళా సంఘాలకు రుణం ఇస్తే డబ్బులు బ్యాంకులో ఉన్నట్టేనని, డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ. 10 లక్షల కోట్లకు ఎదగాలని ఆశిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవంతంగా డ్వాక్రా సంఘాలను నిర్వహిస్తున్న సెర్ప్ ఉన్నతాధికారులను ఆయన అభినందించారు.

■

నీ శక్తి సామర్థ్యాలను అనుమానిస్తే బాధపడకూడదు, ఎందుకంటె బంగారం నాణ్యతను శంకిస్తారు కాని ఇనుమును కాదుగా!

# దేశంలోనే తొలి ఏఐ గ్రామం తెలంగాణలో !

ప్రస్తుతం అంతా ఏఐయే. దేశంలోనే తొలి ఏఐ గ్రామంగా మరికొన్ని రోజుల్లో రికార్డుకెక్కనుందన్న సంగతి తెలుసా? ఈ విషయం అతి కొద్ది మందికి మాత్రమే తెలుసు. అది కూడా తెలుగు రాష్ట్రాల్లోని ఒక గ్రామం.. ఆ గుర్తింపును సొంతం చేసుకోనుంది. ఏజెన్సీ ప్రాంతంలో గ్రామాలు ఎలా ఉంటాయంటే.. అభివృద్ధికే కాదు.. విద్య, వైద్య సౌకర్యాలు సైతం ఆమడ దూరంలో ఉంటాయి. ఈ విషయం అందరికీ తెలిసిందే. కానీ తెలంగాణలో... అది కూడా ఏజెన్సీ ప్రాంతంలోని ఒక గ్రామం దేశంలోనే మొట్టమొదటి ఏఐ గ్రామంగా రికార్డుకెక్కనుంది. ఈ విషయం ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది మాత్రం నూటికి నూరు శాతం నిజం. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామం ఆ ఖ్యాతిని దక్కించుకోనుంది.

ఈ నేపథ్యంలో ఇకపై ఏఐ శ్రీరాంపూర్‌గా ఈ గ్రామాన్ని పిలువనున్నారు. హైదరాబాద్‌కు 250 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. ఇక్కడ ప్రస్తుతం హైస్పీడ్ ఇంటర్ నెట్ సౌకర్యంతో ఆ పల్లె వెలుగులీనుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) సహాయంతో విద్యార్థులకు విద్యా బోధన అందుతోంది. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఈ అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి గతంలో సెల్ ఫోన్ సిగ్నల్స్ సైతం అందేవి కావు. అలాగే ఈ గ్రామంలో విద్యుత్ కోతలూ తీవ్రంగానే ఉ ండేది. దీంతో విద్యా బోధనకు ఈ ప్రాంత ప్రజలు దూరంగా ఉండేవారు.

అయితే, ప్రస్తుతరాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో కోటి ఇళ్లకు టీ ఫైబర్ ప్రాజెక్టు ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ జాబితాలో మంథని అసెంబ్లీ నియోకవర్గంలోని ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామం కూడా ఉంది.

హైదరాబాద్ లేదా మెట్రో సిటీస్‌లో మాత్రమే ఉండే హైస్పీడ్ ఇంటర్ నెట్ ప్రస్తుతం ఈ గ్రామంలోనూ ఉంది. ఇంటింటికీ ఇంటర్నెట్‌లో భాగంగా ఇక్కడ టీవీలు, సెల్ ఫోన్లు అన్నింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కీలకంగా మారింది. ప్రతి ఇంటికీ మోడమ్ ఇవ్వడంతో.. వైఫై సిగ్నల్స్ ద్వారా టీవీలు,సెల్ ఫోన్లు, ల్యాప్ ట్యాప్‌లు పని చేస్తున్నాయి.

ఇక అడవీ శ్రీరాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ పాఠాలు అందిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఫర్ ఫ్లెక్సిటీటూల్స్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో వారంతా ముందుకెళ్తున్నారు. టీవీలే స్మార్ట్ కంప్యూటర్లుగా చేసుకుని.. అంతర్జాతీయ స్థాయి విద్యా బోధనతో విద్యార్థులు దూసుకెళ్తున్నారు.

అంతే కాదు స్కూల్లో విద్యార్థులకు మూడు డిజిటల్ బోర్డులు, రెండు మానిటర్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారానే విద్యార్థులకు టీచర్లు పాఠాలు చెబుతున్నారు. విద్యార్థులు డిజిటల్ బోర్డు ద్వారా గూగుల్ సెర్చ్ చేస్తూ టెక్నాలజీపై అవగాహన పెంచుకుంటున్నారు. అలాగే కార్పొరేట్ కంపెనీ లకే సాధ్యమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సైతం ఈ పాఠశాలల్లోని విద్యార్థులు వినియోగిస్తున్నారు. ఫర్‌ఫ్లెక్సిటీ ఏఐ టూల్స్ ను ఉపయోగించి వాయిస్ మోడ్ ద్వారా పలు ప్రశ్నలకు విద్యార్థులు జవాబులు రాబట్టుకుంటున్నారు.

ప్రస్తుతం ఆ గ్రామంలో ఇంటర్నెట్ సిగ్నల్స్ జెట్ స్పీడ్‌తో అందుతున్నాయి. టీ ఫైబర్ ప్రాజెక్టు చేపట్టిన తర్వాత కేబుల్, డిష్ కనెక్షన్లను కూడా గ్రామస్థులు తీసేశారు. టీ ఫైబర్ నెట్ ఉండటంతో ఇంటి నుంచే అన్ని ఇంటర్ నెట్ పనులను చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఇంటర్నెట్ సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారు.

భవిష్యత్‌లో నెల వారి ఛార్జీలను గ్రామస్తుల నుంచి వసూలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మొత్తానికి అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి ఇంటర్నెట్ వెలుగులు రావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏఐతో

# మూతబడిన ఒంగోలు మహిళా మార్ట్ !

'పట్టణ పేదరిక నిర్మూలనే లక్ష్యం.. ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి చెందాలన్నదే ధ్యేయం ...' అంటూ ప్రారంభించిన ఒంగోలు మహిళా మార్ట్ రెండేళ్లకే మూతపడింది. పొదుపు సంఘాల సభ్యులు తయారుచేసే సరుకులు, తినుబండారాలను మార్ట్‌ల ద్వారా విక్రయించి ఆదాయ వనరులు సమకూర్చాలని భావించారు. నగరంలోని ఊరచెరువులో గతంలో ఏర్పాటు చేసిన నిరాశ్రయుల కేంద్రం (నైట్ షెల్టర్)లో మహిళా మార్టును ఏర్పాటు చేశారు. ప్రారంభ సమయంలో ప్రతి పొదుపు సంఘం నుంచి రూ. 1,500 వసూలు చేశారు. అందుకుగాను ఒక్కో సభ్యురాలు రూ. 150 చొప్పున చెల్లించారు. ఆతర్వాత పొదుపు సంఘాలు తయారు చేసే నిత్యావసర సరుకులు కాకుండా ప్రైవేటు మార్కెట్ ద్వారా కొనుగోలు చేసి పొదుపు సభ్యుల చేత బలవంతంగా అమ్మకాలు చేయించారు. అయితే ప్రస్తుతం ఆ మహిళా మార్ట్ మూతపడింది.

**సేల్స్ గర్ల్స్‌గా ఆర్పీలు**

మహిళా మార్ట్‌ను లాభాల బాటలో నడిపించేందుకు ఆర్పీలను సేల్స్ గర్ల్స్‌గా మార్చేశారు. రోజుకు ఇద్దరికి చొప్పున మార్ట్ డ్యూటీలు వేయడంతో పాటు వారికి టార్గెట్‌లు నిర్ణయించారు. వారి పరిధిలోని పొదుపు సంఘాల సభ్యులకు సరుకులు అంటగట్టారు. మార్ట్‌లో సరుకు మాకొద్దంటూ కొందరు అభ్యంతరం తెలిపినా మెప్మా రూల్స్ పాటించాల్సిందే నంటూ కొనుగోలు చేయించారు. దీంతో లాభాల బాటలోనే నడిచిన మార్ట్ ప్రస్తుతం నష్టాల్లో కూరుకుపోయింది. సొమ్ములు కూడా మాయం కావడంతో నాటి ప్రభుత్వ ఆదేశాలంటూ ఖచ్చితంగా రూ. 1500 చెల్లించాల్సిందేనని వసూలు చేసిన ఆర్పీలు, ఆ తర్వాత సరుకులు కూడా కొనాల్సిందేనని పొదుపు సంఘాల సభ్యులపై ఒత్తిడి తీసు కొచ్చారు. ఆర్పీల చొరవతో మార్ట్ లాభాల బాటలోనే నడిచినా, ప్రస్తుతం కనీసం కేజీ కందిపప్పు కూడా లేని దారుణ పరిస్థితిలో ఉంది. దీంతో లాభాలు, నిల్వ సరుకులు, నగదు ఏమయ్యాయి? అని పొదుపు సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. మార్ట్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఆర్పీలు ఇప్పుడు సంఘాల సభ్యులకు ఏమి చెప్పాలో తెలియక బిక్కమొహం వేస్తున్నారు.

**సరుకులు... సొమ్ము రెండూ మాయం..!**

జిల్లాలో 'జగనన్న మహిళా మార్ట్'లను 2023 సెప్టెంబరు 23న ప్రారంభించారు. ఒంగోలులో మార్ట్‌ను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సుమారు రూ. 50 లక్షల వ్యయంతో ప్రారంభించారు. ఆ తర్వాత ఏడాదికి రూ. 6లక్షల వరకు ఆదాయం రాగా, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ. 28 లక్షలు లాభాల్లో ఉంది. వాటితోపాటు నిత్యావసర సరుకులు స్టాక్ రూ. 25లక్షల వరకూ ఉండింది. ఫర్నిచర్ విలువ మరో రూ. 15లక్షల వరకూ ఉంటుంది. గతేడాది డిసెంబరు వరకు లాభాల బాటలోనే నడిచిన మార్ట్ ఈ ఏడాది జనవరి నుంచి మార్టులో సరుకులు.. సొమ్ము మాయమయ్యాయి. తాము చెల్లించిన సొమ్ము ఏమైంది? వాటిని ఎవరు తిరిగి చెల్లిస్తారు? మార్ట్ మూతకు ఎవరు బాధ్యులు? అన్న ఆందోళన సంఘ సభ్యుల్లో కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

---

విద్యార్థులు పాఠాలు నేర్చుకోవడంతో ఈ గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకుని మిగతా గ్రామాల్లోని విద్యార్థులు కూడా ఏఐపై అవగాహన పెంచుకుంటున్నారు. భవిష్యత్‌లో ఉద్యోగాలు సాధించేందుకు పాఠశాలలో నేర్చుకునే ఏఐ బాగా ఉపయోగపడుతుందని విద్యార్థులు ఈ సందర్భంగా అభిప్రాయపడుతున్నారు. మంత్రి డి. శ్రీధర్ బాబు.. అడవీ శ్రీరాంపూర్‌ని ఏఐ గ్రామమని అభివర్ణించారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

# పొలం పనులకు ఉపాధి హామీ కూలీలు

**తె**లంగాణ రైతులకి ప్రభుత్వం ఒక శుభవార్త చెప్పింది. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. వరదలు, వర్షాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూములను బాగు చేయడానికి ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. దీని ద్వారా ఉపాధి హామీ కార్మికులు రైతుల పొలాల్లో పేరుకుపోయిన ఇసుకను తొలగించి.. భూమిని తిరిగి సాగుకు అనుకూలంగా మారుస్తారు. ఈ నిర్ణయం వల్ల అన్నదాతలకు చాలా మేలు కలుగుతుంది అంటున్నారు.

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ వినిపిస్తుంది. దీని ద్వారా అన్నదాతలకు ప్రయోజనం కలుగుతుందని.. ప్రభుత్వాలు దీనిపై చర్యలు తీసుకోవాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈక్రమంలో తాజాగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పొలం పనులకు ఉపాధి హామీని అనుసంధానం చేసేందుకు అనుమతిచ్చింది.

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాలకు పంటలు బాగా దెబ్బ తిన్నాయి. భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. పంట పొలాలు బాగా దెబ్బ తిన్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో దెబ్బ తిన్న వ్యవసాయ భూములను పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

ఈ పనులను ఉపాధిహామీ కింద అనుసంధానం చేసి పంట పోలాలను పునరుద్ధించాలని.. తిరిగి వాటిని సాగుకు అనుకూలంగా మార్చేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా వరదలతో ఇసుక మేటలు వేసిన భూములను.. తిరిగి సాగుకు అనుకూలంగా మార్చాలని సూచించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు పంచాయతీరాజ్‌శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

గత కొన్ని రోజులుగా తెలంగాణలో కురిసిన భారీ వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 29 జిల్లాల్లో 60 వేల ఎకరాల పంట పొలాలు దెబ్బ తిన్నాయి.

ఈ భూముల్లో ఇసుక మేటలు వేయడంతో సాగుకు వీల్లేకుండా తయారయ్యాయి. దీంతో ఆ భూముల్లో మేట వేసిన ఇసుక, మట్టిని తొలగించి.. తిరిగి దాన్ని సాగుకు అనుకూలంగా మార్చి.. రైతుల జీవనోపాధికి నష్టం వాటిల్ల కుండా చూడాలని వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. దీంతో సర్కార్ ఈ అంశాన్ని పంచాయతీరాజ్ శాఖకు పంపింది.

ఉపాధిహామీ పథకం నిబంధనల మేరకే దీన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించామని అధికారులు తెలిపారు. ఉపాధిహామీ పథకం నియమాల ప్రకారం.. భారీ వర్షాల వల్ల పంట పొలాలు దెబ్బ తింటే.. వాటిని తిరిగి సాగుకు అనుకూలంగా పునరుద్ధరించడం.. నిరుపయోగ భూములను మరమత్తు చేసి.. సాగుకు అనుకూలంగా మార్చేలా చేసేందుకు అవకాశం ఉంది. దీని ప్రకారమే ప్రభుత్వం.. వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు, వ్యవసాయ భూముల్లో ఉపాధి హామీ పనులను చేపట్టేందుకు అంగీకారం తెలిపింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు పంచాయతీరాజ్‌శాఖ మార్గదర్శకాలను జారీచేసింది.

పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెంటనే వరద ప్రభావిత గ్రామాల్లో ఉపాధిహామీ పథకాన్ని అమలు చేసి వ్యవసాయ భూములను పునరుద్ధరించాలని సూచించింది. ఉపాధిహామీ నిబంధనల మేరకు జాబ్‌కార్డు ఉన్న ఒక్కోరైతుకు సంబంధించిన 2 ఎకరాల వ్యవసాయ భూముల్లో ఈయపనులు చేపట్టవచ్చు. అలానే ఒక్కో ఎకరంలో గరిష్ఠంగా 750 క్యూబిక్ మీటర్ల ఇసుకను తొలగించాలి. ఇలా తొలగించిన మట్టి, ఇసుకను సుమారు 3 కిలోమీటర్ల దూరం వరకు తరలించినందుకు గాను ఛార్జీలు చెల్లిస్తారు. ■

**అధికారం, ధనం జీవన ఫలాలు ; కుటుంబం, మిత్రులు జీవన మూలాలు, మూలం లేని ఫలం మరణం!**

# గ్రామాల్లో నీటిగుంటల మాదిరి మ్యాజిక్ డ్రైన్స్!

పారిశుధ్యం మెరుగుపర్చడంతో పాటు దోమలు, అంటువ్యాధులను నియంత్రించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామాల్లో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకం నిధులతో మ్యాజ్ డ్రైన్ల నిర్మాణం చేపడుతోంది. భవిష్యత్తులో ప్రతి గిరిజన గ్రామంలోనూ మ్యాజిక్ డ్రైన్లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు గృహాల్లో వినియోగించిన మురుగు నీరు బయటకు పంపించేందుకు డ్రైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ డ్రైన్లలో కలుషితమైన నీరు ప్రవహిస్తూ, చెత్త పేరుకుపోయి ఉంటుంది. ఈ మురుగు నీరు వాగులు, చెరువుల్లో కలిసి మంచి నీరు కలుషితమవుతున్నది. అలాగే మురుగు కాలువల వద్ద ఈగలు, దోమలు విలయతాండవం చేస్తుంటాయి. దీంతో ప్రతి ఏడాది వర్షాకాలం ప్రజలు అంటురోగాల బారిన పడుతున్నారు.

ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మ్యాజిక్ డ్రైన్లు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఎన్టీఆర్ జిల్లా సోమవరం గ్రామంలో ప్రయోగాత్మకంగా నిర్మించిన మ్యాజిక్ డ్రైన్ విజయవంతంగా కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

### మ్యాజిక్ డ్రైన్ నిర్మాణం ఇలా..

మ్యాజిక్ డ్రైన్ ఇంకుడు గుంతను పోలి ఉంటుంది. ప్రధానంగా 0.55 మీటర్లు వెడల్పు కలిగిన 0.40 మీటర్ల లోతు గల కాలువను తీస్తారు. ఈ కాలువలో తొలుత 225 మిల్లీమీటర్ల రాళ్లు అడుగు భాగంలో మొదటి లేయర్‌గా వేస్తారు. 70-100 మిల్లీమీటర్ల చిప్స్ రెండో లేయర్‌గానూ, 40 మిల్లీమీటర్ల చిప్స్ మూడో లేయర్‌గా, 20 మిల్లీమీటర్ల చిప్స్ నాలుగో లేయర్‌గా వేస్తారు. అలాగే ప్రతి 50 మీటర్ల దూరానికి ఒక 120 సెంటీమీటర్ల ఇంకుడు గుంతను నిర్మిస్తారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థపు నీరు నేరుగా ఈ మ్యాజిక్ డ్రైన్ వద్దకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తారు. వ్యర్థపు నీరు మ్యాజిక్ డ్రైన్‌పై పడగానే ఇంకిపోతుంది.



ఒకవేళ నీరు అధిక మొత్తంలో ఈ డ్రైన్‌పై ప్రవహిస్తే 50 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలో ఇంకిపోతుంది. ఈ మ్యాజిక్ డ్రైన్ వల్ల మురుగు నీరు ఎక్కడా నిలువ ఉండదు.

### మురుగు, దుర్వాసన నియంత్రణ

ఈ మ్యాజిక్ డ్రైన్ వ్యవస్థ మురుగు, దుర్వాసన, దోమల వృద్ధిని నియంత్రించడానికి సహాయపడుతుంది. గృహాల నుంచి వచ్చే వ్యర్థ నీరు మ్యాజిక్ డ్రైన్‌లోకి రాగానే ఎక్కడి కక్కడ ఇంకిపోతుంది. ఈ వ్యవస్థ వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. గ్రామంలో ఉన్న వాగులు, చెరువులు కలుషితం కాకుండా స్వచ్ఛంగా ఉంటాయి. వీధుల్లో దుర్గంధ సమస్య ఉండదు.

### తగ్గనున్న నిర్మాణ ఖర్చు

సాధారణంగా సిమెంట్ డ్రైన్లు నిర్మాణానికి ఖర్చు అధికంగా అవుతుంది. వంద మీటర్ల సిమెంట్ డ్రైన్ నిర్మాణానికి రూ.4 నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేయాలి. 100 మీటర్ల మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి కేవలం రూ.64.5 వేలు ఖర్చు అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. అలాగే సిమెంట్ డ్రైన్లు నిర్వహణ పంచాయతీ సిబ్బందికి భారంగా మారింది. మ్యాజిక్ డ్రైన్ నిర్వహణ చాలా సులభంగా ఉంటుంది. ■

# డ్వాక్రా మహిళలకు డ్రోన్లు,తృప్తి క్యాంటీన్లు,అరకు కాఫీ స్టాల్స్ !

**ఆం**ధ్రప్రదేశ్‌లో డ్వాక్రా మహిళల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం వినూత్న ఆలోచనలు చేస్తోంది. ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారి వచ్చేలా 'ఒక కుటుంబం-ఒక వ్యాపారి' నినాదాన్ని తీసుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా డ్వాక్రా మహిళలకు ఆర్థికంగా నిలదొక్కుకుని స్వయం ఉపాధి పొందే దిశగా, వారి ఆదాయం పెంచేలా కేంద్రంతో కలిసి అడుగులు వేస్తోంది. మెప్మా, దీన్‌దయాళ్ జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్‌లు కలిసి రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు రుణాలను మంజూరు చేయిస్తున్నారు. బ్యాంకుల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహం అందిస్తున్నారు. డ్వాక్రా మహిళలతో ఎంఎస్ఎంఈ లు గా రిజిస్ట్రేషన్ చేయించి చిన్న వ్యాపారాలు, యూనిట్లకు సబ్సిడీతో రుణాలు అందిస్తున్నారు. ఉపాధి కోర్సుల్లో శిక్షణ యిస్తారు.



**రాయితీపై డ్రోన్లు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు పంట పొలాల్లో పురుగు మందులు పిచికారీ చేయడానికి డ్రోన్లను రాయితీపై ఇవ్వాలని నిర్ణయించింది. దీనికోసం మండలాల వారీగా మహిళలను ఎంపిక చేస్తున్నారు. ఎంపికైన మహిళలకు డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇస్తారు. చాలామంది రైతులు వరి, కూరగాయలు పండిస్తారు.. ఈ పంటలకు తెగుళ్లు వస్తే పురుగు మందులు పిచికారీ చేయడానికి మహిళలకు డ్రోన్లు ఉపయోగపడతాయి. అందుకే మహిళలకు డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇస్తారు.

డ్రోన్ల నిర్వహణపై ఆసక్తి చూపించినవారి పేర్లను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), ప్రభుత్వానికి పంపిస్తారు. డ్రోన్ ధర రూ. 10 లక్షలు కాగా, ప్రభుత్వం రూ. 8 లక్షల రాయితీ ఇస్తుంది. మిగిలిన రూ. 2 లక్షలను స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు ఇస్తారు. ఐదుగురు కలిసి ఈ రూ. 2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఆ డబ్బుల్ని కూడా రుణం తీసుకోవచ్చు. కేంద్రం వ్యవసాయానికి డ్రోన్లను సరఫరా చేస్తుంది. వివిధ కంపెనీలను ఎంపిక చేసి రాష్ట్రాలకు పంపుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు డీహెచ్-ఏజీ-ఈ 10 రకం డ్రోన్లు రానున్నాయి. వీటి బరువు తక్కువగా ఉంటుంది.. బ్యాటరీతో పని చేస్తాయి.

వ్యవసాయంలో డ్రోన్ల వాడకం రైతులకు లాభదాయకం అంటున్నారు అధికారులు. ఆదాయం పెరగడంతో పాటు ఆరోగ్యంపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవు అంటున్నారు. డ్రోన్ల ద్వారా మందులు పిచికారి చేయడం సురక్షితమని.. మాన్యువల్‌గా పిచికారి చేయడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు తప్పుతాయంటున్నారు. అలాగే డ్రోన్లతో మందుల వినియోగం కూడా తగ్గుతుందని చెబుతున్నారు.

**తృప్తి క్యాంటీన్లు**

ఏపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా తృప్తి క్యాంటీన్లను ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ఈ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో క్యాంటీన్ ఏర్పాటు చేసి నిర్వహించాలంటే నలుగురు డ్వాక్రా మహిళలు రూ. 16.40 లక్షలు పెట్టుబడి పెట్టాలి. వీరిలో ఒక్కొక్కరు రూ. 3.10 లక్షల చొప్పున మొత్తం రూ. 12.40 లక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. మెప్మా, మరో సంస్థ

గౌరవం రెండు విధాలుగా వస్తుంది ; అధికారంతో లేదా ప్రవర్తనతో ; మొదటిది తాత్కాలికం, రెండవది శాశ్వతం!

కలిసి అవసరమైన వస్తువులు అందిస్తారు. ఇలా ఒక్కో క్యాంటీన్ నెలవారీ టర్నోవర్ రూ. 6.39 లక్షలు.. ప్రతి నెలా రూ. 2.46 లక్షలు లాభం వచ్చే అవకాశం ఉంటుందట.

**అరకు కాఫీ స్టాల్స్**

డ్వాక్రా మహిళలకు కియోస్కి మోడల్‌లో అరకు కాఫీ స్టాల్స్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక్కో అరకు కాఫీ ఔట్‌లెట్ ఏర్పాటు చేయడానికి రూ. 6 లక్షలు వ్యయం అవుతుంది. అయితే డ్వాక్రా మహిళలకు అంత మొత్తం భారంగా మారుతుందని, రూ. 3.50 లక్షల్లోపే ఏర్పాటు చేసేలా ఎంవోయూ చేసుకున్నారు. ఈ 3.50 లక్షల రూపాయలలో కూడా డ్వాక్రా మహిళలకు రూ.లక్ష వరకు ఉన్నతి పథకంలో రుణం మంజూరు చేస్తారు. మిగిలిన డబ్బుల్ని బ్యాంకు రుణం ద్వారా అందిస్తారు. ఈ స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు సొంత స్థలం లేదా ప్రభుత్వం స్థలం చూపిస్తే అనుమతులు ఇస్తారు. ఈ ఔట్‌లెట్లలో అరకు కాఫీతో పాటు ఇతర ఉత్పత్తులను కూడా అమ్మవచ్చు. అంతేకాదు రద్దీగా ఉండే కూడళ్లలో చాయ్‌రాస్తా ఏర్పాటు చేస్తున్నారు.. వీటిని ఆ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఈ చాయ్‌రాస్తా ఏర్పాటుకు రూ. 8 లక్షల వరకు రుణం అందిస్తారు. అలాగే డ్వాక్రా మహిళలకు ర్యాపిడో ద్వారా కూడా ఉపాధి కల్పిస్తున్నారు. ప్రభుత్వం బైక్‌లు, ఆటోలు కొనుగోలు చేసేందుకు రుణాలు అందిస్తున్నారు. బైక్, స్కూటీ అయితే రూ.లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు రుణం ఇస్తారు. అదే ఆటో అయితే రూ. 3 లక్షల నుంచి రూ. 3.50 లక్షల వరకు రుణం అందిస్తారు.

**ఎగ్ కార్టులు**

వీటితో పాటుగా డ్వాక్రా మహిళలకు ఎగ్ కార్టులను కూడా అందజేస్తున్న సంగతి తెలిసిందే.. ఈ ఎగ్ కార్ట్ విలువ రూ. 50 వేలు. ఫుడ్ ప్రాసెస్ యూనిట్ల కోసం కూడా రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మెప్మా ద్వారా పలువురు డ్వాక్రా మహిళలు ఉపాధి పొందుతున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిపి రుణాలు అందిస్తున్నాయి. ఆసక్తి ఉన్న మహిళలు ఈ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెబుతున్నారు. మరిన్ని వివరాల కోసం మెప్మా, వెలుగు అధికారులు, ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచిస్తున్నారు.

**కొరమీను పెంపకం యూనిట్లు**

డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో డీఆర్‌డీఏ వారితో కొరమీను పెంపకం యూనిట్లు ఏర్పాటు చేయించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. త్వరలోనే యూనిట్లు కూడా ఏర్పాటు కానున్నాయి. అయితే ఇది గుంటూరు జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు మాత్రమే.

ఇందులో భాగంగా గుంటూరు జిల్లాలో కొరమీనుల పెంపకం యూనిట్లను డీఆర్‌డీఏ ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించాలని భావిస్తోంది. మొదటి దశలో.. గుంటూరు నగరం, పొన్నూరు, తెనాలిలోని డ్వాక్రా సంఘాల మహిళలకు కొరమీను పెంపకం యూనిట్లు కేటాయిస్తారు.

రెండో దశలో మంగళగిరి, తాడేపల్లిలో ఏర్పాటు చేస్తారు. డ్వాక్రా సంఘాల సభ్యులుగా ఉండి, ఆసక్తి కలిగిన మహిళలకు డీఆర్డీఏ, వెలుగు అధికారులు కొరమీను పెంపకం యూనిట్ల ఏర్పాటులో సహకారం అందిస్తారు. ఒక్కో యూనిట్ కోసం రూ. 1.50 లక్షల నుంచి రూ. 3 లక్షలు ఖర్చు కానుంది. ఇందుకోసం స్త్రీనిధి, ఉన్నతి పథకం ద్వారా రుణాలు అందిస్తారు.

డ్రోన్ల వాడకం రైతులకు చాలా ఉపయోగకరం అంటున్నారు. డ్రోన్లతో పిచికారి చేస్తే రసాయనాల వాడకం 10% వరకు తగ్గుతుంది. ఒక ఎకరాకు 5-7 నిమిషాల్లో పిచికారి చేయవచ్చని చెబుతున్నారు. రైతులు డ్రోన్లను అద్దెకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు అంటున్నారు. ప్రస్తుతం చాలా చోట్ల ఎకరానికి రూ. 500 చొప్పున అద్దె వసూలు చేస్తున్నారట. ఇటు డ్వాక్రా మహిళలకు ఉపాధితో పాటుగా అటు రైతులకు ఉపయోగంగా ఉంటుంది అంటున్నారు. మరిన్ని వివరాల కోసం సెర్ప్, మండల వ్యవసాయశాఖ అధికారుల్ని సంప్రదించవచ్చు. ■

స్నేహ గుణం ఎంతగా నీ బలహీనత అయితే అంతగా నిన్ను మించిన బలశాలి వుండడు

# ఒక్కసారి నాటితే ఆరుపంటలు పండే వరి!



ఒక్కసారి నాట్లేసి మూడేళ్లలో వరుసగా ఆరు సార్లు పంట కోసుకునే రోజులు రానున్నాయి. ఇలాంటి వరిని 'పెరెన్నియల్ రైస్' (పీఆర్) అంటున్నారు. ఈ విలక్షణ వరి వంగడాలను రూపొందించుకున్న చైనా ఏడేళ్లుగా సాగు చేస్తోంది. ఉత్పత్తి ఖర్చులు 40% మేరకు తగ్గుతాయి. నికరలాభం పెరుగుతుంది.

పనిలో పనిగా భూసారం, జీవవైవిధ్యం కూడా పెరుగుతుంది. చైనా తదితర దేశాల్లో ఏటేటా పీఆర్ వరి సాగు విస్తరిస్తోంది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) కూడా దీనిపై తాజాగా దృష్టి సారించింది. 'ఫార్మింగ్ సిస్టం' జర్నల్ తాజా సంచికలో భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్) శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్ షణ్ముగం రాసిన అధ్యయన పత్రం ఆధారంగా 'సాక్షి సాగుబడి' ప్రత్యేక కథనం

ఖర్చులు పెరిగిపోవటం, ఆదాయం తగ్గిపోవటం, నీటి అవసరాలు పెరగటం, భూసారం క్షీణించటం, హరితగృహ వాయువులతో పర్యావరణానికి తీరని హాని జరగటం.. ఇవీ ప్రస్తుతం మన దేశంలో వరి వ్యవసాయాన్ని వేధిస్తున్న సవాళ్లు. దాదాపు ఈ సమస్యలన్నిటికీ ఏకకాలంలో చెక్ పెట్టే అద్భుతమైన 'పెరెన్నియల్ రైస్' వంగడాలను చైనా శాస్త్రవేత్తలు రూపొందించారు. ఈ వరి వంగడాలను చైనాలో రైతులు ఏడేళ్లుగా సాగు చేస్తున్నారు.

సాధారణంగా వరి పంటను ఒక్కసారి నాటితే ఒక్కసారే పంట చేతికి వస్తుంది. తర్వాత సీజన్‌లో మళ్లీ దున్ని, దమ్ము చేసి, నాట్లు వేసుకుంటున్నాం. ఈ వంగడం ఒక్కసారి నాటితే చాలు. మొత్తంగా చూస్తే పీఆర్ వరుసగా 6 సీజన్లలో తిరిగి పెరిగే వరి పంటను కోసుకోవచ్చు. పటిష్టంగా ఉండే కుదుళ్లు పంట కోసిన తర్వాత మళ్లీ చిగురించి, పిలకలన్నీ మొదటి పంటలాగే ఏపుగా పెరగటం పీఆర్23 వంగడం ప్రత్యేకత. ఒక్కసారి నాట్లు వేస్తే చాలు.. ఇక తర్వాత ప్రతి పంట కాలంలోనూ మళ్లీ మళ్లీ పొలాన్ని దున్ని, నాట్లు వేయాల్సిన అవసరం ఉండదు. ఈ వరి మొక్కల వేర్లు సాధారణ రకాల (అడుగు) మొక్కల వేర్ల కన్నా బలంగా ఉండి రెట్టింపు (2 అడుగుల) లోతుకు చొచ్చుకెళ్తాయి.

**యున్నన్ యూనివర్సిటీ ఆవిష్కరణ**

చైనాలోని యున్నన్ రాష్ట్రంలోని 'యున్నన్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (వైఏఏఎస్)' పెరెన్నియల్ రైస్ వంగడాలను రూపొందించింది. ఒరిజా సటివ అనే సాధారణ వరి రకాన్ని ఒరిజా సాంగిస్తామినట అనే ఆఫ్రికా అటవీ జాతి వరి మొక్కతో ఎంబ్రయో రెస్క్యూ టెక్నిక్‌ను

ఉపయోగించి సంకరం చేసి 'పెరెన్నియల్ రైస్ – పీఆర్23' వంగడాన్ని రూపొందించింది. అధిక దిగుబడి, గింజ నాణ్యత గల పీఆర్24, పీఆర్25, పీఆర్101, పీఆర్107 వంగడాలను 2020లో విడుదల చేసింది.

**17 దేశాల్లో ప్రయోగాత్మక సాగు**

2018 నుంచి దక్షిణ చైనాలో 44,752 మంది చిన్న రైతులు 15,333 హెక్టార్లలో పీఆర్ వంగడాలను నీటిపారుదల సదుపాయంతో సాగు చేస్తున్నారు. వీరంతా ఆర్థికంగా, పర్యావరణపరంగా ప్రయోజనాలు పొందుతున్నారని యున్నన్ యూనివర్సిటీ ప్రకటించింది. ఇంటర్నేషనల్ పెరెన్నియల్ రైస్ కొలాబరేషన్ తోడ్పాటుతో యున్నన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని 17 దేశాల్లో విభిన్న పర్యావరణ పరిస్థితుల్లో సాగవుతున్న పీఆర్ వంగడాలు స్థిరంగా మెరుగైన దిగుబడిని ఇస్తు న్నట్లు యున్నన్ యూనివర్సిటీ తెలిపింది.

**వరి గడ్డితో ఆచ్ఛాదన**

కోతల తర్వాత గడ్డిని సాళ్ల మధ్య ఆచ్ఛాదనగా వేస్తున్నారు. దీంతో పోషకాలు పునర్వినియోగమవుతూ భూసారం మెరుగవుతోంది. నేలలో సూక్ష్మ జీవరాశి జీవవైవిధ్యం పెరుగుతోంది. కలుపు సమస్య తగ్గుతోంది. రసాయనిక పురుగుమందులు, కలుపుమందుల అవసరం తగ్గుతున్నది. అవసరం మేరకు ఏడాదంతా కొద్ది కొద్దిగా నీరు ఇచ్చినప్పటికీ, మొత్తంగా సాగు నీటి వాడకం తగ్గుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

**29% తగ్గిన ఉత్పత్తి వ్యయం**

ప్రతి ఏటా నాట్లు వేసే పద్ధతిలో కన్నా ఒక్కసారి నాట్లు వేసి మూడేళ్లలో మొత్తం ఆరు పంటలు కోసుకునే ఈ పద్ధతిలో అన్ని ఖర్చులూ కలిపి ఉత్పత్తి వ్యయం 29% తగ్గిందని నాలుగేళ్ల అధ్యయనంలో తేలింది. మొదటి సీజన్‌లో అన్ని ఖర్చులూ మామూలే. రెండో సీజన్ నుంచి 54% వరకు కూలి ఖర్చులు ఆదా అవుతాయి.

మొత్తం మూడేళ్లలో ఆరు పంట సీజన్లకు గాను... 5 పంట సీజన్లలో సీజన్‌కు 68–77 పని దినాల అవసరం తగ్గుతుంది. వాతావరణాన్ని కలుషితం చేసే యంత్రాల వాడకమూ తగ్గుతుంది. పీఆర్23 ధాన్యం మిల్లింగ్ సామర్థ్యం 73% నమోదైంది. ప్రతి ఏటా నాట్లు వేసే పద్ధతి కన్నా పీఆర్ పద్ధతిలో దిగుబడి 8.8% తక్కువైనప్పటికీ, రైతుకు నికరాదాయం 235% పెరిగిందని అధ్యయన పత్రం తెలిపింది.

**మన సగటు దిగుబడి కన్నా ఎక్కువే**

ఒకసారి పంట కోసిన తర్వాత తిరిగి పెరగటంలో పీఆర్23 వంగడం పనితీరు మెరుగ్గా ఉందని గుర్తించారు. దీని పిలకలు 90–98% తిరిగి పెరిగాయి. అందువల్ల వాణిజ్యపరమైన సాగుకు ఈ వంగడాన్ని ఉపయోగిస్తున్నారు. 119 రోజుల్లో పీఆర్23 పంట కోతకు వస్తోంది. తొలి కోతలో హెక్టారుకు 6.8–7.5 టన్నుల ధాన్యం దిగుబడిని ఇస్తుండగా, తర్వాత కోతల్లో 5.4–6.3 టన్నుల వరకు దిగుబడి వస్తోందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. భారత్‌లో సగటు వరి ధాన్యం దిగుబడి హెక్టారుకు 4.2 టన్నులు మాత్రమే. కాబట్టి మన రైతులకు ఇది ఉపయోగకరమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**ముందున్న సవాళ్లు**

పీఆర్ వరి సాగులో ప్రయోజనాలతో పాటు సవాళ్లు కూడా ఉన్నాయి. మన దేశపు వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పీఆర్ వరి వంగడాలను రూపొందించుకోవాలి. పంట కోసిన తర్వాత తిరిగి పంట చిగురించటం కోసం నీరు పెడతాం. మొలకలు రాకముందే మోళ్లు కుళ్లిపోయే అవకాశం ఉంది. మొలకల కన్నా కలుపు వేగంగా పెరిగే అవకాశం ఉంది. గడ్డిని ఆ పొలంలోనే ఆచ్ఛాదనగా వేయటం వల్ల కలుపు కొంత అదుపులో ఉన్నప్పటికీ, కలుపు మందులు వాడక తప్పదు. మోళ్లలో మిగిలిన రోగకారకాలు చీడపీడల బెడదను పెంచవచ్చు. వేసవి అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతల్లో పంటను రక్షించుకోవటం అంత తేలిక కాదు. సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం నిధులను విరివిగా వెచ్చించి పరిశోధనలను వేగంగా కొనసాగించాలి. అన్నీ సజావుగా జరిగితే కొద్ది సంవత్సరాల్లో భారతీయ పెరెన్నియల్ రైస్ వంగడాలు మన రైతులకు అందుబాటులోకి రావచ్చు.

– సాక్షి సౌజన్యంతో

■

మెచ్చుకునే వారికంటె విమర్శించే వారి వల్లనే ఎక్కువమేలు జరుగుతుంది, మనం బలపడడానికి వారే మూలం

# మునగ సాగుచేస్తే ఎకరాకు రూ.లక్ష ఉచితం!

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. రాష్ట్రంలో మునగ సాగు చేసే రైతులకు ఆర్థికంగా సహాయం చేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. డ్వామా ద్వారా ఎకరాకు రూ. 1,00,828 వరకు ఉచితంగా ఇస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మునగ సాగుతో లాభాలు పొందండి. మరిన్ని వివరాల కోసం మీ మండలం లోని ఉపాధి హామీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఆరోగ్యానికి మేలు చేసే పంట కావడంతో ఎక్కువ మంది రైతులు సాగు చేసేందుకు ప్రోత్సాహం అందిస్తోంది. డ్వామా ద్వారా తోటల పెంపకం, వాటిని కాపాడటానికి డబ్బులు ఇస్తోంది. ఇటీవల కాలంలో రైతులు మునగ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. రెండేళ్ల పాటూ తోట నిర్వహణకు ఎకరాకు రూ. 1,00,828 వరకు ఇస్తోంది. ఈ డబ్బును ఉచితంగానే ఇస్తోంది.

రైతులు తమ పొలంలో 25 సెంట్ల నుంచి ఒక ఎకరా, ఐదు ఎకరాల వరకు మునగను సాగు చేయొచ్చు. ఈ మేరకు డ్వామా ఉపాధి హామీ పథకం కింద డబ్బులు ఇస్తుంది. రైతులు దీనిని పూర్తిస్థాయి పంటగా సాగు చేయాలి. అలాగే ఒక ఎకరాకు 448 మునగ మొక్కలు నాటాలి. రైతులు పొలంలో మొక్కలు నాటడానికి గుంతలు తీయడంతో పాటుగా ఎరువులు వేయడానికి, మునగ తోటలో వేరే పంటలు వేయడానికి.. ఇలా రెండేళ్ల పాట తోటను చూసుకునేందుకు ప్రభుత్వం సాయం చేస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు వారి పొలం భూమి పాస్ బుక్ జీరాక్స్, 1బి, ఉపాధి హామీ జాబ్ కార్డు జిరాక్స్ తీసుకొని మండల ఉపాధి హామీ కార్యాలయం లేదా ఎంపిడిఓ లేదా గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌కి అంద జేస్తే ఈ ప్రాసెస్ మొత్తం చేస్తారని అధికారులు చెబుతున్నారు.



గతంలో మునగ సాగుపై రైతులు అంతగా ఆసక్తి చూపలేదు. కానీ ఇప్పుడు మునగ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. మునగ కాయలు, ఆకులు, ఆకు పొడిని ప్రజలు ఎక్కువగా వాడుతున్నారు. దీనితో మునగ సాగు లాభదాయకమని అధికారులు చెబుతున్నారు. ఆకులు, విత్తనాలు, కాయలు అన్నీ ఉపయోగించి డబ్బు సంపాదించవచ్చు అని సూచిస్తున్నారు. పొడిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయవచ్చు అంటున్నారు.. ఇలా రైతులు ఆదాయం పొందవచ్చునని అధికారులు పేర్కొన్నారు. ■

## రైతులకు ఆసరాగా ఏపీ ఎయిమ్స్ 2.0

**సా**మూహికంగా రైతుల ఫోన్లకు సూచనలు, సలహాలు పంపించే వ్యవస్థను వ్యవసాయశాఖ రూపొందిం చింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార యాజమాన్య వ్యవస్థ.. ఏపీ ఎయిమ్స్-2.0 అని దీనికి పేరుపెట్టింది. దీని ద్వారా ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సంక్షిప్త సందేశాలను పంపుతారు. వాసర్ లాబ్స్ అభివృద్ధి చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా రియల్ టైమ్‌లో రైతులకు ఎస్ఎంఎస్‌లు రానున్నాయి. ఆండ్రాయిడ్, యాపిల్ ఫోన్లకే కాకుండా, సాధారణ ఫోన్లకు కూడా వస్తాయని అధికారులు తెలిపారు. ■

# ఆసక్తిని రేకెత్తిస్తూ, అంగన్వాడీలలో ఆదర్శ బోధన!

**– భవాని**

శ్రీరామ్‌నగర్–1 అంగన్‌వాడీ కేంద్రం గత 24 ఏళ్ళుగా చిన్నారులకు రెండో ఇల్లులా మారింది. ఈ మార్పు వెనుక నిలిచిన ప్రధాన శక్తి శ్రీమతి భారతమ్మ. డిగ్రీ చదివిన ఆమె, గత 24 ఏళ్లుగా ఆంగన్‌వాడీ టీచర్‌గా అంకిత భావంతో పని చేస్తున్నారు.

తల్లులతో, సమాజంతో భారతమ్మకు మంచి అను బంధం ఉంది. అందుకే పిల్లలు ప్రతిరోజూ ఆనందంగా కేంద్రానికి వస్తుంటారు. ఆమె వారిని వివిధ ఆటలలో నిమగ్నం చేస్తూ, పాటలు పాడుతూ, ఆసక్తికరమైన కథలు చెబుతూ, నేర్చుకునే ప్రక్రియను సంతోషకరంగా మారుస్తుంది. ఈ విధానం వల్ల చిన్నారులలో పాఠశాలపై ఆసక్తి పెరిగి, వారు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు.

ఈ కేంద్రం ప్రభుత్వ పాఠశాలలోనే ఉండటంతో చిన్నారుల ప్రారంభ విద్యకు పాఠశాల విద్యతో ముడిపడింది. ఇంతేకాదు, రెయిన్‌బో అనే మరో స్వచ్ఛంద సంస్థ కూడా ఇక్కడి స్లమ్ పిల్లలకు ట్యూషన్‌లు నిర్వహిస్తోంది. దీనివల్ల ఆ పిల్లలు మరింత బలమైన పునాది వేసుకుని పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

'ఏపిమాస్ బృందం మా కేంద్రంలో నిర్వహించిన 'పెరుగుదల పర్యవేక్షణ (గ్రోత్ మానిటరింగ్) శిక్షణ' మాకు చాలా ఉపయోగపడింది. ఈ శిక్షణ ద్వారా మేము పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం, వారి ఎదుగుదల సరిగా జరుగుతోందా లేదా అన్నది గుర్తించడం, బరువు, ఎత్తు వంటి విషయాలను సరిగా కొలవడం వంటి పద్ధతులను మళ్లీ నేర్చుకున్నాం. ఈ శిక్షణ వల్ల మా పనితీరు మెరుగుపడింది, తల్లులకు కూడా పిల్లల ఆరోగ్యం గురించి సరైన అవగాహన కల్పించగలుగుతున్నాం అని'' ఏపిమాస్ సహకారం పట్ల కృతజ్ఞత వ్యక్తంచేశారు శ్రీమతి భారతమ్మ.

తన కృషి, మమకారం, సమాజంతో కలిసి పనిచేసే తత్వం వల్ల భారతమ్మ కేవలం అంగన్‌వాడీ టీచర్‌గానే కాకుండా పిల్లలకు మార్గదర్శకురాలిగా, కథలతో మమకారాన్ని నింపే స్నేహితురాలిగా నిలిచారు. పోషణ పథకం స్ఫూర్తితో గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు సరియైన సహకారం అందిస్తున్నారు.

**సహాయకురాలి నుంచి టీచర్‌గా ....**

శ్రమ, పట్టుదల, నిబద్ధత ఉంటే ఎదుగుదల తప్పక లభిస్తుందనేదానికి చక్కని ఉదాహరణ యశోద! యశోద మొదట అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలిగా (హెల్పర్‌గా) పని చేసింది. ఆ సమయంలో ఆమె బాధ్యత కేవలం వంట చేయడం, పిల్లల కోసం ఆహారం సిద్ధం చేయడం, శుభ్రత చూడటం వంటి పనులకే పరిమితం. కానీ యశోద అంతటితో సరిపెట్టకుండా టీచర్‌కు ప్రతి పనిలో సహకరిస్తూ, పిల్లలతో పాటలు పాడిస్తూ, అంకిత భావాన్ని, కృషిని చూపించింది.

ఆమె పనితీరును గమనించిన ప్రభుత్వం ఆమెకు శివాజీనగర్ బస్తీ లో టీచర్‌గా పదోన్నతి కల్పించింది. ఈ కొత్త బాధ్యతను స్వీకరించిన తర్వాత యశోద ఆనందంతో... "నేను ఇంతకాలం సహాయకురాలిగా పని చేశాను, ఇప్పుడు టీచర్‌గా నా పిల్లలను మరింత శ్రద్ధగా చూసుకుంటాను. పాటలు పాడిస్తూ, రైమ్స్, రకరకాల ఆటలు, కథలు నేర్పిస్తూ ఆనందపరుస్తాను" అని యశోదఉత్సాహంగా చెబుతుంది. ఏపిమాస్ ప్రాజెక్టు టీమ్ అందించిన సహకారం తనకు ఎంతో ఉపయోగపడిందని ఆమె ధన్యవాదాలు చెప్పారు.

ఇప్పుడు యశోద ప్రతి రోజును ఒక అవకాశంగా భావిస్తూ పిల్లలతో ఆనందంగా గడుపుతోంది. ఆమె బోధనలో పాటలు, పద్యాలు, కథలు తప్పనిసరిగా ఉంటాయి. సరదాతో కూడిన శిక్షణ పట్ల ఆమె శ్రద్ధ తీసుకుంటోంది. ఫలితంగా పిల్లలు అంగన్‌వాడీకి ఆనందంగా వస్తున్నారు. పని చిన్నదా, గొప్పదా అనేది ముఖ్యం కాదు. అది ఎంత నిబద్ధత, నిజాయితీతో చేస్తామన్నదే నిజమైన విజయం. ■

**పోటీదారులు నీ పద్ధతులను, పనితీరును అనుకరించవచ్చు, కాని నీ అంకితభావాన్ని ఎవరూ అనుకరించలేరు**

# ఒక్కసారి సాగు ... 40 ఏళ్ళపాటు ఆదాయం!

ఆంధ్రప్రదేశ్‌లో రైతుల కోసం మరో సరికొత్త ఆలోచనను అమలు చేస్తుంది ప్రభుత్వం. ఎరువులతో పని లేకుండా, బీడు భూమిలోనూ సాగు చేసేలా.. ఒక్కసారి సాగు చేస్తే 40 ఏళ్ల వరకు లక్షల్లో ఆదాయం గడించే మార్గాన్ని చూపి స్తోంది. వెదురును సాగు చేసేందుకు రైతుల్ని ప్రోత్సహిస్తోంది. రాతి నేలలు, బీడు భూముల్లో వెదురు సాగు చేయొచ్చు. ఈ చెట్లు ఏపుగా పెరుగుతాయి. పంట పండని భూముల్లో కూడా సాగు చేసుకోవచ్చు. ఎరువులు అవసరం లేదు, సంరక్షణ చర్యలు అవసరం లేదు. ఒక్కసారి పంట సాగు చేస్తే 40 ఏళ్ల పాటూ ఆదాయం పొందొచ్చంటున్నారు. ఇటీవల కాలంలో ప్లాస్టిక్, పాలిథిన్ స్థానంలో వెదురు ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. వెదురు ఉత్పత్తుల కోసం తయారీ కేంద్రాల ఏర్పాటుకు ప్లాన్ చేస్తున్నారు.



మన దేశంలో ఏకంగా 136 వెదురు రకాలు ఉన్నట్లు చెబుతారు. వీటిలో ముళ్లతో ఉండేవి అడవుల్లో పెంచడానికి బాగుంటాయని, పారిశ్రామికంగా ముళ్లు లేని టుల్డా రకం నాణ్యత బావుంటుందని చెబుతారు. ఎకరాకు 160 మొక్కలు నాటాలి. 15 అడుగులకు ఒక మొక్క నాటాలి. ఈ మొక్కల్ని నాటిన తర్వాత మూడేళ్ల పాటు పెంచాలి. ఆ తర్వాత నాలుగో ఏడాది నుంచి ఆదాయం వస్తుంది. ఎకరాకు మూడేళ్లకు కలిపి రూ.40 వేలు ఖర్చు అవుతుంది. నాలుగో ఏడాది నుంచి వెదురు చెట్ల ద్వారా ఎకరాకు రూ.1.20 లక్షల ఆదాయం పొందొచ్చు.

రాష్ట్రంలో వెదురు సాగును ప్రోత్సాహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెదురు ఇండస్ట్రీ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకుంది. సెర్ప్ ద్వారా డ్వాక్రా మహిళల్లో పదివేల మందిని ఎంపిక చేసి, ఈ సాగుకు చేయూత అందిస్తున్నారు. 37 సెంట్ల సొంత భూమి ఉంటే, వారికి మొక్కలు యిస్తున్నారు. అంతేకాదు సాగు ఖర్చులు కూడా అందిస్తారు. జిల్లా స్థాయిలో పండించిన వెదురును మహిళా సమాఖ్యల ద్వారా, ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా కొనుగోలు చేస్తారు. జిల్లాకో ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నారు. ఏపీలో ముందుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**అనుమతి అవసరం లేదు**

కేంద్రం కూడా వెదురు సాగును ప్రోత్సహించేందుకు, వెదురును అటవీ జాతుల జాబితానుంచి తప్పించింది. గడ్డి జాతి మొక్కగా చేర్చారు. కాబట్టి రైతులు సాధారణ పంటలా సాగు చేయొచ్చు. గతంలో వెదురు నాటేందుకు, నరికేందుకు అనుమతి తప్పనిసరి. ఇప్పుడు పంట సాగుకు, సరకు రవాణాకు అనుమతి అవసరం లేదు. కుదిరితే వెదురుతో పాటుగా అదే పొలంలో పెసర, మినుము, కంది, ఔషధ మొక్కలు, తీగ జాతి రకం పంటలు సాగుచేసి ఆదాయం పొందొచ్చు. వెదురు మొక్కలు నాటిన తర్వాత రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుంది. వెదురును ముక్కలు చేసి పరిశ్రమలకు పంపిస్తే మరో రూ.లక్ష ఆదాయం వస్తుందంటున్నారు. ఈ వెదురుతో దువ్వెనలు, బ్రష్‌లు, గొట్టాలు, అగర్‌బత్తీ పుల్లలు, స్టిక్స్ సహా పలు వస్తువుల్ని తయారు చేస్తున్నారు. బయోచార్, బొగ్గు, వెదురు పొట్టును కూడా కొనుగోలు చేస్తారు. వీటితో కూడా ఆదాయం పొందొచ్చు. అంతేకాదు బిర్యానీ వండటానికి కూడా వెదురు బొంగులు కావాలి. పాలిథిన్ ప్లేట్లు, కప్పులు, స్పూన్ల స్థానంలో వెదురు ఉత్పత్తుల్ని తెస్తున్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు .

(సమయం సౌజన్యంతో)

ద్వేషించడం కాక ప్రేమించడం, అనుకరించడం కాక అనుసరించడం, పొగడడం కాక అభినందించడం నేర్చినవాడు వివేకి


## మీకు తెలుసా ?

**గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..**

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

**రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...**

**ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ...** **ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!**

# మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

# వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD1064/2024-26
Publication Date:01-10-2025 Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 Posting Date: 05/06-10-2025






బీహార్‌లో ఎఫ్ పి ఓల మహాసమ్మేళనం ... మరికొన్ని దృశ్యాలు





పి4 ప్రాజెక్ట్ లో భాగంగా రామకుప్పం మండలంలో బంగారు కుటుంబాలతో ఏపిమాస్ , ఎం ఇ ఐ ఎల్ బృందాల చర్చలు



గుర్రంకొండ ఎఫ్ పి ఓ తృతీయ వార్షిక మహాసభ దృశ్యం




కలికిరి ఎఫ్ పి ఓ ఆరవ వార్షిక మహాసభ దృశ్యం



విప్రో రన్ కు సహకారం అందించిన ఏపిమాస్ బృందంలో కొందరు




గోరంట్లపల్లిలో నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్థులు

To ADDRESS



కర్ణాటకలో శిక్షణ పొందిన ఏపిమాస్ బృందం

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలనీ,
తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089